టాప్ న్యూస్

## కేసీఆర్ మీద ఈగ వాలనియ్య



- రాష్ట్రం తెచ్చిన కేసీఆర్‌కు నోటిసులిస్తారా?
- కేసీఆర్‌కు నోటీసులివ్వడమంటే తెలంగాణకు ఇచ్చినట్టే
- 'అది కాళేశ్వరం కమిషన్ లేక కాంగ్రెస్ కమిషన్ హ?
- నోటీసులకు వ్యతిరేకంగా తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో మహా ధర్నా
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

02


## కవిత కొత్త నినాదం



- అప్పుడు సామాజిక న్యాయం ఎటు పోయింది?
- ఆనాడు బీసీల గురించి మీ నాన్నను ఎందుకు అడగలేదు?
- మీ తాటాకు చప్పళ్లకు, ఉడత ఊపులకు బీజేపీ భయపడదు
- కవిత వ్యాఖ్యలకు ఎంపీ రఘునందన్ రావు కౌంటర్

02

## కేసీఆర్ కుటుంబంలో కుంపటి



- ఆస్తి పంపకాల్లో తేడాలు వచ్చి వాళ్లు రోడ్డున పడ్డారు
- రాజకీయ ముఖచిత్రంలో ఇక బీఆర్ఎస్ పార్టీ ఉండదు
- బీఆర్ఎస్, బీజేపీ చీకటి ఒప్పందాన్ని కవిత బహిర్గతం చేశారు
- బండి సంజయ్ యువ మోర్చా నాయకుడిలాగా మాట్లాడుతున్నాడు
- టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ గౌడ్

02


ANN తెలుగు

Follow: @ANNTELUGU

01-06-2025

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 179 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM






# ప్రపంచ సుందరి ఓపల్ సుచాతా..

## మిస్ వరల్డ్ కిరీటం దక్కించుకున్న థాయ్‌లాండ్ భామ

## విజేతకు 8.5 కోట్ల ప్రైజ్ మనీ

- ఫస్ట్ రన్నరప్‌గా మిస్ ఇథియోఫియా, సెకండ్ రన్నరప్‌గా మిస్ పోలాండ్
- మూడో రన్నరప్‌గా నిలిచిన మిస్ మార్టినిక్
- పోటీల్లో పాల్గొన్న 108 దేశాల అందగత్తెలు
- 72వ ప్రపంచ సుందరి పోటీలకు వేదికైన తెలంగాణ
- హైటెక్స్‌లో గ్రాండ్‌గా సాగిన మిస్ వరల్డ్ ఫైనల్
- ఫైనల్స్‌కు హాజరైన సీఎం రేవంత్, మంత్రులు, సినీ ప్రముఖులు





**మహా:** మిస్ వరల్డ్ 2025 గ్రాండ్ ఫినాలేలో థాయిలాండ్ ప్రతినిధి ఓపల్ సుచాతా చువాంగ్‌శ్రీ మిస్ వరల్డ్ 2025 విజేతగా నిలిచారు. ఓపల్ సుచాతా మిస్ థాయిలాండ్ వరల్డ్ 2023గా ఎంపికయ్యారు. మిస్ యూనివర్స్ 2024లో మూడవ రన్నర్ అప్‌గా నిలిచారు. ఆమె ఆకర్షణీయమైన వ్యక్తిత్వం, బలమైన స్టేజ్ ప్రెజెన్స్, సామాజిక కారణాల పట్ల నిబద్ధతకు సరైన గౌరవం దక్కింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జూలియా మోర్లీ, క్రిస్టినా పిజ్కోవా చేతుల మీదుగా విజేతగా నిలిచిన ఓపల్ సుచాత కిరీటాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు అభినందనలు వెల్లువెత్తాయి. ఈ పోటీల్లో రెండవ స్థానంలో ఇథియోపియా, మూడో ప్లేస్‌లో పోలాండ్, నాలుగవ స్థానంలో మార్టినిక్ సుందరీమణులు నిలిచారు. విజేతగా నిలిచిన ఓపల్ సుచాతాకు 8.5 కోట్ల ప్రైజ్ మనీ దక్కుతుది. మీరు మిస్ వరల్డ్‌గా ఎన్నికైతే ఏం చేస్తారు అని జడ్జిలు అడిగిన ప్రశ్నలకు.. సామాజిక సేవా నిబద్ధత, ముఖ్యంగా విద్య, మానసిక ఆరోగ్యం గురించి ఆమె చేస్తున్న కృషిని కొనసాగిస్తానని ప్రభావవంతంగా చెప్పారు.

**ఓపల్ సుచాత నేపథ్యం..**

ఓపల్ సుచాత సువాంగ్ థాయ్‌లాండ్‌లోని ఫుకెట్‌లో(2003) జన్మించారు. ఈమె గతంలో మిస్ యూనివర్స్ థాయిలాండ్

మిగతా 4లో



## కాల్పుల విరమణపై ట్రంప్ ఎలా ట్వీట్ చేశారు

- రఫెల్ విమానాల కూల్చివేతపై కాంగ్రెస్ వాదనే నిజమైంది
- ఎయిర్ చీఫ్, సీడీఎస్ వ్యాఖ్యలే నిదర్శనం
- ఆయనను కూడా దేశ వ్యతిరేకి అంటారా ?
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

వివరాలు 2లో



## బీఆర్ఎస్ బీజేపీలో కలిసే ప్రసక్తే లేదు

- కొన్ని రాజకీయ పార్టీలు చేస్తున్న కుట్రలు
- బీఆర్ఎస్ ను బలహీనపర్చాలని కుట్ర ప్రచారం
- ఎమ్మెల్సీ మధుసూదనాచారి కీలక వ్యాఖ్యలు

వివరాలు 2లో



## పాత నగరం చేసిన పాపం ఏంది

- హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ
- పాతబస్తీ సమస్యలపై ఎంఐఎం అధినేత ఆందోళన
- పనిచేయని ట్రాఫిక్ సిగ్నళ్లపై పోలీసు ఉన్నతాధికారుల నిర్లక్ష్యంపై మండిపాటు
- చిరువ్యాపారుల తొలగింపుతో లక్షల కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన
- ఉపాధి కోల్పోతే దోపిడీలు, దొంగతనాలు పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరిక

వివరాలు 2లో

# ఈ వీక్‌లోనే మంత్రివర్గ విస్తరణ?

## 4న ఢిల్లీకి సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్

- పీసీసీ కార్యవర్గం, కేబినెట్ విస్తరణపై హైకమాండ్ తో చర్చలు
- ఇప్పటికే కమిటీలకు గ్రీన్ సిగ్నల్.. వాటికి కూడా ఓకే చెప్పే చాన్స్
- అవకాశం ఎవరికో.. ఆశావహుల్లో మొదలైన ఉత్కంఠ




**మహా:** జూన్ 4న సీఎం రేవంత్ రెడ్డి , పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఢిల్లీకి వెళ్లానున్నారు. పీసీసీ కార్యవర్గం, కేబినెట్ విస్తరణపై అధినాయకత్వంతో చర్చించనున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే పలుమార్లు హస్తిన వెళ్లి ఈ రెండు అంశాలపై చర్చించారు. పీసీసీ కార్యవర్గం దాదాపుగా ఖరారైందనే ప్రచారం జరిగినప్పటికీ అది కాస్తా పెండింగ్ లో పడిపోయింది. ఇదే తరుణంలో ఏఐసీసీ రాష్ట్రవ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ రాష్ట్రానికి వచ్చారు.

మిగతా 2లో

# గిరిజన సంక్షేమానికి పెద్దపీట

## వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఇందిరాగాంధీ హయాంలో అసైన్డ్ భూములను పంపిణీ చేశారు
- ఆ భూములను బీఆర్ఎస్ నాయకులు పక్కదోవ పట్టించారు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి





**మహా:** ఇందిరాగాంధీ హయాంలో సుమారు 25 లక్షల ఎకరాల అసైన్డ్ భూములను గిరిజనులకు పంపిణీ చేశారని, ఆ భూములను బీఆర్ఎస్ ప్రభుత్వంలో నాయకులు పక్కదోవ పట్టించారని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గిరిజన అభివృద్ధి సంక్షేమానికి పెద్దపీట వేస్తామని చెప్పారు. శనివారం కిన్నెరసానిలోని ఎస్టీ గురుకులంలో నిర్వహించిన తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్ బునియాది కార్యకర్త సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నూతన విధానాలతో స్కీం లను ప్రవేశపెడుతుందని తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడుకునేందుకు విలువైన భూములను కాపాడేందుకు ప్రజా ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి కట్టుబడి ఉందని అన్నారు.

మిగతా 2లో

# ఎరువుల కొరత లేదు

## వ్యవసాయనికి పెద్ద పీట

- భూ భారతి చట్టం పేదల చుట్టం
- రికార్డు స్థాయిలో ధాన్యం సేకరణ జరిగింది
- పథకాలు అర్హులైన ప్రతి పేద వారికి అందాలి
- సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- మంత్రులు దామోదర్ రాజనర్సింహ, కొండా సురేఖ

02





## స్కూల్స్ పేరుతో రేవంత్ స్కామ్

- ఎస్సీ గురుకులాల పట్ల ఎందుకు వివక్ష
- ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం తన అనుచరులకు ఇచ్చే ప్రయత్నం
- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

02

## గోశాలల అభివృద్ధికి ప్రత్యేక కమిటీ

ముఖ్యమంత్రి రేవంత్ నిర్ణయం


వివరాలు 2లో

# స్కూల్స్ పేరుతో రేవంత్ స్కామ్

## ఎస్సీ గురుకులాల పట్ల ఎందుకు వివక్ష

### ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం తన అనుచరులకు ఇచ్చే ప్రయత్నం

### బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు



**మహా:** ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం తన అనుచరులకు ఇచ్చే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పేరుతో రేవంత్‌రెడ్డి స్కామ్ చేస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ ప్రభుత్వ పాలనలో గురుకులాలు అధో:పాతాళానికి వెళ్తున్నాయని ఆక్షేపించారు. చాలామంది పేద పిల్లలు రోడ్డున పడాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గాల పట్ల ఐఏఎస్ అలుగు వర్షిని వివక్ష చూపుతున్నారని మండిపడ్డారు. అందరికంటే పెద్ద మాదిగ,పెద్ద మాల తానే అని రేవంత్ రెడ్డి అంటారని.. కానీ పేద పిల్లలు టాయిలెట్స్ వాళ్లే కడుక్కోవాలని ఐఏఎస్ అధికారితో ఎలా చెప్పిస్తారని ప్రశ్నించారు. ఎస్సీలు ఇంజనీర్లు, డాక్టర్లు కావాలని మాజీ సీఎం కేసీఆర్ గురుకులాలు ఏర్పాటు చేశారని గుర్తుచేశారు.

**కూర్చోబెట్టి మాట్లాడలేని అధికారులు**

రేవంత్ ప్రభుత్వం ఎస్సీ గురుకులాల పట్ల వివక్షతో వ్యవహరిస్తోందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. తల్లిదండ్రులను కూర్చోబెట్టి మాట్లాడలేని అధికారులను సాంఘిక సంక్షేమ శాఖలో ఎందుకు నియమించారని ప్రశ్నించారు. గురుకుల విద్యార్థిని ఆగసార నందినికి గోల్డ్ మెడల్ వస్తే సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు నగదు ప్రోత్సాహం ఇవ్వరని నిలదీశారు. గౌలిదొడ్డిలోని గురుకుల పాఠశాల సిబ్బందిని తొలగిస్తున్నారని చెప్పుకొచ్చారు. గౌలిదొడ్డిలో ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులను బయటకు పంపాలని ఆదేశాలు ఇచ్చారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ నేతలం గురుకుల బాట చేపడితే తమను లోపలికి రానివ్వలేదని మండిపడ్డారు. ఇదేనా ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ రాజ్యాంగం చేతిలో పట్టుకుని చెబుతున్న రాజ్యాంగ నీతి అని ప్రశ్నించారు. సంపన్న వర్గాల పిల్లలకు ఒక రూల్ పేద పిల్లలకు ఒక రూలా అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నల వర్షం కురిపించారు. ఎస్సీలకు బాయ్స్, గర్ల్స్‌కు ఒకే చోట తరగతులు ఉండకూడదని ప్రభుత్వం అంటోందని.. అమ్మాయిలకు భువనగిరిలో సైనిక స్కూల్ ఏర్పాటు చేస్తే దాన్ని ఎందుకు మూసివేశారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. రేవంత్ ప్రభుత్వం మొద్దు నిద్రపోతుందని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 30 గురుకుల మహిళా డిగ్రీ కాలేజీలను కేసీఆర్ ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ఈ రోజు డిగ్రీ కాలేజీల్లో ఒక్క అడ్మిషన్ కూడా కాలేదని అన్నారు. గురుకుల మహిళా డిగ్రీ కాలేజీలు మూతపడే విధంగా రేవంత్ రెడ్డి, అలుగు వర్షిని కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. గురుకుల భవనాలు కట్టడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం స్థలం ఇచ్చిందని గుర్తుచేశారు. గురుకుల ఇంటర్ కాలేజీల్లో విద్యార్థులు ఫెయిల్ అయితే ప్రభుత్వం ఎందుకు సప్లమెంటరీ ఫీజు కట్టలేదని ప్రశ్నించారు. గురుకులాల విద్యార్థులు రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ దగ్గరకు వెళ్తే ఆయన ఏం చేయలేకపోయారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వెల్లడించారు.

గిరిజన సంక్షేమానికి

# పెద్దపీట



(మొదటిపేజీ తరువాయి)

అంతకు ముందు జరిగిన కార్యక్రమం కిన్నెరసాని వద్ద గల గిరిజన బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి శ్రమదానం చేశారు. ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి స్వయంగా పిచ్చి మొక్కలను తొలగించి, చెత్తను ఎత్తివేసి శుభ్రం చేశారు. ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జ్ మీనాక్షి నటరాజన్ ఈ ప్రాంగణంలో మొక్క నాటారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ ఆదేశాల మేరకు జై బాపు, జై భీమ్ జై సంవిధాన్ నినాదంతో ముందుకెళ్తున్నామని అన్నారు. ప్రజలు చైతన్యవంతులని, ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ చేస్తుందని అన్నారు.

# పాత నగరం చేసిన పాపం ఏంది

## హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ

పాతబస్తీ సమస్యలపై ఎంఐఎం అధినేత ఆందోళన
పనిచేయని ట్రాఫిక్ సిగ్నళ్లపై పోలీసు ఉన్నతాధికారుల నిర్లక్ష్యంపై మండిపాటు
చిరువ్యాపారుల తొలగింపుతో లక్షల కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన
ఉపాధి కోల్పోతే దోపిడీలు, దొంగతనాలు పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరిక



**మహా :** హైదరాబాద్ నగరంలోని పాతబస్తీ ఎదుర్కొంటున్న పలు సమస్యల పట్ల మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. "పాతబస్తీ ఏం పాపం చేసింది?" అంటూ ప్రభుత్వ అధికారుల తీరును, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ ప్రశ్నించారు. పాతనగరంలో వరుసగా జరుగుతున్న అగ్నిప్రమాదాలు ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయని, సరైన నివాస వసతులు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. పాతబస్తీలో నెలకొన్న పరిస్థితులపై ఒవైసీ మాట్లాడుతూ, "పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడంతో రోజురోజుకూ పరిస్థితులు దారుణంగా మారుతున్నాయి. ఇరుకైన రహదారులు, భారీ ట్రాఫిక్‌తో వాహనదారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ముఖ్యంగా, అధిక ట్రాఫిక్ ఉన్న ప్రాంతాల్లో కూడా సిగ్నల్ లైట్లు పనిచేయడం లేదు. ఈ విషయాన్ని పోలీసు ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు" అని అసహనం వ్యక్తం చేశారు. రోడ్ల వెంట చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారిని ఖాళీ చేయిస్తున్నారని అసదుద్దీన్ ఆరోపించారు. "ఇలాంటి చిరు వ్యాపారాలపై లక్షలాది కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. వారికి ఉపాధి దూరం చేస్తే దోపిడీలు, దొంగతనాలు పెరిగే అవకాశం ఉంది. ఈ విషయాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి, తక్షణమే ఒక నిర్ణయం తీసుకోవాలి" అని ఆయన విజ్ఞప్తి చేశారు. పాతబస్తీ అభివృద్ధి విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఒవైసీ డిమాండ్ చేశారు. వరుస అగ్నిప్రమాదాలు, నివాస సమస్యలు, పారిశుధ్య లోపం వంటి అంశాలపై తక్షణమే దృష్టి సారించాలని ఆయన కోరారు.



# కవిత కొత్త నినాదం

- అప్పుడు సామాజిక న్యాయం ఎటు పోయింది?
- ఆనాడు బీసీల గురించి మీ నాన్నను ఎందుకు అడగలేదు?
- మీ తాటాకు చప్పళ్లకు, ఉడత ఊపులకు బీజేపీ భయపడదు
- కవిత వ్యాఖ్యలకు ఎంపీ రఘునందన్ రావు కౌంటర్

**మహా:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన "సామాజిక తెలంగాణ" వ్యాఖ్యలపై మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తీవ్రంగా స్పందించారు. 'కవిత ఇప్పుడు సామాజిక తెలంగాణ అంటూ కొత్త నినాదం అందుకుంది" అని ఆయన ఎద్దేవా చేశారు. 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కేవలం ముగ్గురు బీసీలకు మాత్రమే మంత్రివర్గంలో స్థానం కల్పించారని గుర్తుచేశారు. "ఆనాడు బీసీల గురించి మీ నాన్నను ఎందుకు అడగలేదు? అప్పుడు సామాజిక న్యాయం ఎటు పోయింది?" అని రఘునందన్ రావు నిలదీశారు. కవిత చేసే తాటాకు చప్పళ్లకు, ఉడత ఊపులకు బీజేపీ భయపడబోదని ఆయన అన్నారు. కవిత బీఆర్ఎస్ పార్టీ నుంచి బయటకు వచ్చి జూన్ 2న కొత్త రాజకీయ పార్టీ పెట్టబోతున్నారంటూ వార్తలు విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఆమె పార్టీ ఏర్పాటు ప్రచారాన్ని ఖండించారు.

# కాల్పుల విరమణపై ట్రంప్ ఎలా ట్వీట్ చేశారు

## రఫెల్ విమానాల కూల్చివేతపై కాంగ్రెస్ వాదనే నిజమైంది

ఎయిర్ చీఫ్, సీడీఎస్ వ్యాఖ్యలే నిదర్శనం
ఆయనను కూడా దేశ వ్యతిరేకి అంటారా ?
మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు



**మహా:** చైనా , పాకిస్థాన్‌తో ముప్పు నేపథ్యంలో భారత్ భద్రతను పటిష్టం చేయాలని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత ఎయిర్‌ఫోర్స్ విజయాలపై తాము గర్విస్తున్నామని కొనియాడారు. మన సైనికులు అద్భుతమైన ఆపరేషన్ నిర్వహించారని, ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేశారని ప్రశంసించారు. శనివారం ఢిల్లీ వేదికగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. యుద్ధంలో రాఫెల్ యుద్ధ విమానాలు కూలిపోయాయా.. అనే ప్రశ్నకు భారత విదేశాంగ శాఖ మంత్రి సరైన సమాధానం చెప్పలేదని అన్నారు. ఆపరేషన్‌లో రాఫెల్ యుద్ధ విమానం కూలిపోయిందని సీడీఎస్ అనిల్ చౌహాన్ మాత్రం స్పష్టం చేశారని తెలిపారు. భారత ప్రభుత్వం ఇకనైనా దీన్ని నిరాకరించడం మానుకోవాలని.. ఇదే విషయాన్ని ఏఐసీసీ అగ్ర నేత రాహుల్‌గాంధీ మొదటి నుంచి అడుగుతున్నారని గుర్తు చేశారు. కాల్పుల విరమణ గురించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎలా ట్వీట్ చేశారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. ఫైటర్ విమానాలు, ఆయుధాలను అందించడంలో ఆలస్యం అవుతుందని ఎయిర్ చీఫ్ మార్షల్ చెప్పడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. బ్లూమ్‌బర్గ్ ఛానెల్‌లో భారత సీడీఎస్ ఈ విషయాన్ని వెల్లడించారని గుర్తుచేశారు. 42 ఫైటర్ విమానాలు మంజూరైతే... మన వద్ద కేవలం 31 యుద్ధ విమానాలు మాత్రమే ఉన్నాయని చెప్పుకొచ్చారు. తేలికపాటి యుద్ధ విమానాలను సప్లై చేయడంలో హెచ్ఏఎల్ ఆలస్యం చేస్తోందని.. అత్యవసరంగా ఈ సమస్యను పరిష్కరించాలని అన్నారు. ఆపరేషన్, ఆర్ అండ్‌డీ విభాగాల్లోకి బెస్ట్ బ్రెయిన్స్ రావడం లేదని.. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం పారదర్శకత పాటించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.



# కేసీఆర్ కుటుంబ కుంపటి

## ఆస్తి పంపకాల్లో తేడాలు వచ్చి వాళ్లు రోడ్డున పడ్డారు

- రాజకీయ ముఖచిత్రంలో ఇక బీఆర్ఎస్ పార్టీ ఉండదు
- బీఆర్ఎస్, బీజేపీ చీకటి ఒప్పందాన్ని కవిత బహిర్గతం చేశారు
- బండి సంజయ్ యువ మోర్చా నాయకుడిలాగా మాట్లాడుతున్నాడు
- టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ గౌడ్ హాట్ కామెంట్స్

**మహా:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత వ్యవహారంపై టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. శనివారం భద్రాద్రి జిల్లా పాల్వంచలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కవిత ఇష్యూ కేసీఆర్ కుటుంబ కుంపటి.. ఆస్తి పంపకాల్లో తేడాలు వచ్చి వాళ్లు రోడ్డున పడ్డారని హాట్ కామెంట్స్ చేశారు. తెలంగాణ రాజకీయ ముఖచిత్రంలో ఇక బీఆర్ఎస్ పార్టీ ఉండదని జోస్యం చెప్పారు. కవిత చెప్పిన వాటిలో కొన్ని విషయాలు వాస్తవాలు ఉన్నాయన్నారు. బీఆర్ఎస్, బీజేపీ చీకటి ఒప్పందాన్ని కవిత బహిర్గతం చేసిందని అన్నారు. వీటన్నింటికి బీఆర్ఎస్, బీజేపీ జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ కేంద్ర మంత్రిగా ఉండి ఇంకా యువ మోర్చా నాయకుడిలాగా మాట్లాడుతున్నాడుని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీకి అభివృద్ధి, సంక్షేమం విషయంలో స్పష్టత ఉందన్నారు.

**హక్కులను కాపాడుతూనే..**

బీఆర్ఎస్ పార్టీ పదేళ్లు రాష్ట్రాన్ని దోచుకుంది.. బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉండి బీఆర్ఎస్ అవినీతిని ఆపలేకపోయిందని విమర్శించారు. బీఆర్ఎస్ అవినీతిపై బీజేపీ కేవలం ప్రకటనలకే పరిమితం అయ్యిందని.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాకే కమిషన్లు చర్యలకు పూనుకుందని గుర్తు చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందంతో ప్రజా ధనాన్ని దోపిడి చేశాయని విమర్శించారు. బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ వేసిన ప్రశ్నలకు బండి సంజయ్, కిషన్ రెడ్డి జవాబు చెప్పి.. ఆ తర్వాత మాట్లాడాలని చురకలంటించారు. ఇందిరా గాంధీ మొదలు రాహుల్ గాంధీ వరకు కాంగ్రెస్ పార్టీ గిరిజన, ఆదీవాసీ హక్కులను కాపాడుతూనే ఉందని.. లంబాడ, కోయ, గోండులను ఆదుకోవాలనే ధ్యేయం కాంగ్రెస్ పార్టీకి ఉందని పేర్కొన్నారు.

# ఎరువుల కొరత లేదు




## వ్యవసాయనికి పెద్ద పీట

- భూ భారతి చట్టం పేదల చుట్టం
- రికార్డు స్థాయిలో ధాన్యం సేకరణ జరిగింది
- పథకాలు అర్హులైన ప్రతి పేదవారికి అందాలి
- సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- మంత్రులు దామోదర్ రాజనర్సింహ, కొండా సురేఖ

**మహా:** సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోలు, వ్యవసాయం, వర్షాకాల ముందస్తు ప్రణాళిక ,ఇందిరమ్మ ఇల్లు, భూభారతి, తదితర అంశాలపై మంత్రులు దామోదర్ రాజనర్సింహ, కొండా సురేఖ, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే సంజీవ రెడ్డి, జిల్లా కలెక్టర్ సంగారెడ్డి క్రాంతి వల్లూరు, మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరితో పాటు సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రులు ఉమ్మడి జిల్లాలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలు ధాన్యం సేకరణ, వ్యవసాయం,ఇందిరమ్మ ఇండ్లు, భూ భారతి చట్టం పై జిల్లాల వారీగా కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రజా సంక్షేమ పథకాలు అందాలన్నారు. రికార్డ్ స్థాయిలో ధాన్యం పండిస్తున్నామన్నారు. దేశంలోనే ధాన్యం పండించడంలో మొదటిస్థానంలో ఉందన్నారు. ధాన్యం పండించడమే కాకుండా ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నామన్నారు. ప్రజా ప్రభుత్వంలో రైతులందరూ సంతోషంగా ఉన్నారన్నారు. సన్నారకు బోనస్ తో రైతులు పంటలు పండించడానికి పరిత ముందుకు వస్తున్నారు అన్నారు. కలెక్టర్ లే వెళ్లి నేరుగా రైతులను కలుస్తున్నారన్నారు. ఇందిరమ్మ ఇండ్ల 5 లక్షలు రూపాయలు చెల్లిస్తున్నామని, నియోజకవర్గానికి 3500 ఇండ్లు అదనంగా 20% ఉందని కూడా అందిస్తున్నామని తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో వ్యవసాయనికి పెద్ద పీట వేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ధరణితో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారని ఈ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని అన్నారు. రైతులకు ఎలాంటి ఎరువుల, విత్తనాల కొరత లేదని పూర్తి స్థాయి లో స్టాక్ లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉమ్మడి జిల్లాలో 95 శాతం ధాన్యం సేకరణ పూర్తి అయిందన్నారు. అకాల వర్షం తో తడిసిన ధాన్యాన్ని కూడా కొంటాం అని రైతు కళ్ళంలో ఉన్న చివరి గింజ వరకూ సేకరిస్తాం అన్నారు.

**సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం..**

మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. సమాజంలో ప్రజల జీవన విధానంలో మార్పు ప్రజా ప్రభుత్వం ద్వారానే సాధ్యం అవుతుందన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని,అర్హులైన ప్రతి పేద వారికి ఇందిరమ్మ ఇండ్లు పంపిణీ చేయాలని, ప్రజా ప్రభుత్వంలో నూతన భూ భారతి చట్టం తీసుకొని రావడంతో రైతులు,ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. భూ భారతి చట్టంతో రైతులు కార్యాలయ చుట్టూ, కోర్టుల చుట్టూ తిరిగే అవకాశం లేదన్నారు. గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ వేసి చెత్త నీటి నిల్వ లేకుండా చూడాలన్నారు. తాగునీటి ఇబ్బందులు లేకుండా కరెంటు సమస్య రాకుండా చూడాలని అధికారం ఆదేశించారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో ఇసుక కొరత లేకుండ చుడలని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యం లో ఎన్నో ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ భూ భారతి చట్టం పై ప్రజలకు అవగాహన కల్పించాలని,ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ధాన్యం కొనుగోలు పూర్తిగా కొనుగోలు చేయాలని, పాఠశాలకు పున: ప్రారంభం లో పాఠశాల పరిశుభ్రం చేయాలని సరిపడా సిబ్బంది ఉన్నారా లేదా అని అధికారులు దృష్టి సారించాలని అన్నారు.



# బీఆర్ఎస్ బీజేపీలో కలిసే ప్రసక్తే లేదు

- కొన్ని రాజకీయ పార్టీలు చేస్తున్న కుట్రలు
- బీఆర్ఎస్ ను బలహీన పర్చాలని కుట్ర ప్రచారం
- ఎమ్మెల్సీ మధుసూదనాచారి కీలక వ్యాఖ్యలు

**మహా:** బీఆర్ఎస్ పార్టీ బీజేపీలో కలవబోతుంది అనే కొంతమంది వ్యక్తులు, కొన్ని రాజకీయ పార్టీలు చేస్తున్న కుట్రలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో మధుసూదనాచారి మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ వ్యతిరేకంగా టీడీపీ ఆవిర్భావం జరిగింది. ప్రతికూల పరిస్థితుల్లో కేసీఆర్ టీఆర్ఎస్‌ను స్థాపించారు. తెలంగాణ అంటే నక్సలైట్లు అన్న సందర్భంలో కేసీఆర్ పార్టీని పెట్టారు. కాంగ్రెస్, టీడీపీలకు ధీటుగా టీఆర్ఎస్ ఆవిర్భావం జరిగింది. ఇద్దరు బలమైన నాయకులు చంద్రబాబు, వైఎస్ఆర్‌ను కేసీఆర్ ఎదుర్కొన్నారు. తెలంగాణ సాధించి కేసీఆర్ సీఎం అయ్యి అభివృద్ధి చేశారు. బీఆర్ఎస్ పార్టీని బలహీనపర్చాలని కుట్ర పూరితంగా ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తెలంగాణ ప్రయోజనాలను కాపాడవని ఆయన స్పష్టం చేశారు. కేసీఆర్ సీఎంగా లేనందుకు ప్రజలు బాధపడుతున్నారు. కేసీఆర్ పాలన చర్చకు వస్తే కాంగ్రెస్, బీజేపీల రాజకీయ పునాదులు కదులుతాయి. పరిపాలనలో కాంగ్రెస్, బీజేపీ ప్రజల మెప్పు పొందాలి. కేంద్రమంత్రుల భాష, వారి పాలన ప్రజలు అసహ్యించుకునే విధంగా ఉంది. కేసీఆర్ నాయకత్వం పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారు. జూన్ 2వ తేదీన తెలంగాణ భవన్‌లో ఆవిర్భావ వేడుకలు జరుగుతాయి. కేసీఆర్ ఆలోచనలు నాకు తెలుసు. తెలంగాణ ప్రయోజనాలకు ఎట్టి పరిస్థితుల్లో భంగం కలగదు. తెలంగాణ ప్రజలు ఉన్నంతవరకు బీఆర్ఎస్ ఉంటుంది. పార్టీలో ఏ నిర్ణయం అయినా కేసీఆర్ తీసుకుంటారు. జూన్ 2వ తేదీన కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇస్తారు అని మధుసూదనాచారి తెలిపారు.

# ఎరువుల కొరత లేదు



(మొదటిపేజీ తరువాయి)

ఇక్కడే ఉంటూ పలు జిల్లాల నేతలతో మాట్లాడుతూ ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారు. డిస్ట్రబెన్స్ ఉన్న జిల్లాల్లో అందరినీ ఒక్కతాటిపైకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. జూన్ 4 న ఢిల్లీ వెళ్లనున్న ఈ ఇరువురు నేతలు ఈ సారి పీసీసీ కార్యవర్గం, కేబినెట్ లో ఖాళీగా ఉన్న మంత్రి పదవుల భర్తీపై పూర్తి స్థాయి క్లారిటీతో వస్తారనే చర్చ ఉంది. జూన్ ఫస్ట్ వీక్ లో మంత్రి వర్గ విస్తరణ ఉంటుందని ఇప్పటికే పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. తెలంగాణ కేబినెట్ లో ఇప్పటి వరకు 12 మంది ఉన్నారు. ఇంకా ఆరుగురికి చాన్స్ ఉంది. దీని కోసం ఇప్పటికే ఆశావహులు ఎదురుచూస్తున్నారు. ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు.

# కేసీఆర్ మీద ఈగ వాలనియ్య

## రాష్ట్రం తెచ్చిన కేసీఆర్‌కు నోటిసులిస్తారా?



కేసీఆర్‌కు నోటీసులివ్వడమంటే తెలంగాణకు ఇచ్చినట్టే
'అది కాళేశ్వరం కమిషన్ లేక కాంగ్రెస్ కమిషన్ హ?
నోటీసులకు వ్యతిరేకంగా తెలంగాణ జాగృతిఆధ్వర్యంలో మహా ధర్నా
బనకచర్ల ప్రాజెక్ట్‌పై సీఎం ఎందుకు మాట్లాడటం లేదు?
ఏపీ ప్రయోజనాల కోసమే రేవంత్ పనిచేస్తున్నారు
రేవంత్ ఇప్పటికైనా జై తెలంగాణ అని నినదించాలి
ఉద్యమకారులపైకి గన్ తీసుకెళ్లినోళ్లు రాష్ట్రానికి సీఎం అయ్యారు
ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు

**మహా:** కొత్త పార్టీ పెడతారని ఊహాగానాల మధ్య నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ మీద కాకుండా రేవంత్ రెడ్డి లక్ష్యంగా తీవ్ర విమర్శలు చేశారు. తన తండ్రి కేసీఆర్ మీద ఈగ వాలనీయనని సంచలన ప్రకటన చేశారు. కేసీఆర్‌కు ఒక కన్ను బీఆర్ఎస్, రెండో కన్ను తెలంగాణ జాగృతి అని ప్రకటించారు. ఖబడ్దార్ రేవంత్ రెడ్డి అనే తరహాలో కవిత బస్తీ మే సవాల్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని కవిత తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ జాగృతి కార్యాలయాన్ని హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో శనివారం ఎమ్మెల్సీ కవిత ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో సంచలన వ్యాఖ్యలు చేశారు. 'కేసీఆర్ మీద ఈగ వాలనియ్యం' అని ప్రకటించారు. జాగృతి చేస్తున్న కార్యక్రమాలకు కొంతమంది ఆగమవుతున్నారని తెలిపారు. కేసీఆర్‌కు ఇచ్చిన నోటీసులకు నిరసనగా ఈనెల 4వ తేదీన ధర్నా చేస్తున్నట్లు ఎమ్మెల్సీ కవిత వెల్లడించారు. ఈ ధర్నాకు అందరినీ స్వాగతం పలుకుతున్నట్లు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు.

**సీఎం జై తెలంగాణ అనరు**

'తెలంగాణ సోయితో కేసీఆర్ పరిపాలన చేశారు. మన కర్మ ఇప్పుడు ఉన్న సీఎం జై తెలంగాణ అనరు. జూన్ 2వ తేదీన సీఎం జై తెలంగాణ అనాలి. అమరవీరులకు నివాళులర్పించాలి' అని రేవంత్ రెడ్డిని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. 'రాజీవ్ యువ వికాసం పేరుతో కార్యక్రమం ఉండొద్దు. రాజీవ్ గాంధీ తెలంగాణకు ఏం సంబంధం' అని కవిత ప్రశ్నించారు. ఆ పథకానికి తెలంగాణ కోసం అమరులైన శ్రీకాంతాచారి, యాదిరెడ్డి లాంటి వారి పేరు పెట్టాలి' అని విజ్ఞప్తి చేశారు. గోదావరి కావేరీ అనుసంధానం పేరుతో గోదావరి నీరు తెలంగాణకు దూరం కాబోతున్నాయని ఎమ్మెల్సీ కవిత ఆందోళన వ్యక్తం చేశారు. '200 టీఎంసీ నీళ్ల హక్కు కోసం రేవంత్ రెడ్డి నోరు మెదపరు. నీళ్ల హక్కుల కోసం పోరాటం చేయాలి' అని డిమాండ్ చేశారు. 'తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కు ఎందుకు నోటీసులు ఇచ్చారు' అని నిలదీశారు. 'అది కాళేశ్వరం కమిషన్ లేక కాంగ్రెస్ కమిషన్ హ?' అని సందేహం వ్యక్తం చేశారు. కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడానికి వ్యతిరేకంగా తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద జూన్ 4వ తేదీన మహా ధర్నా చేపడుతున్నట్లు ఎమ్మెల్సీ కవిత ప్రకటించారు. కాంగ్రెస్ కాళేశ్వరంపై కుట్రలను ఎండగడుతున్నామని.. బీజేపీ బీసీ బిల్లును డీ ఫ్రీజ్‌లో పెట్టే ప్రయత్నం చేస్తే జాగృతి తరపున మళ్లీ పోరాటం చేస్తామని తెలిపారు. 'విద్యార్థులు, మహిళల కోసం, మైనార్టీల కోసం ఇచిన హామీల అమలు కోసం పోరాటం చేస్తాం' అని ప్రకటన చేశారు. 'గోదావరి నీళ్లు తరలించే కుట్ర జరుగుతుంది. కుట్రలో కాంగ్రెస్, బీజేపీ, తెలుగుదేశం భాగమే.

# సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాలు

## దేశంలోని ఏడు స్టేషన్లు ఎంపిక.. అందులో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఒకటి



**మహా :** నిత్యం రద్దీగా ఉండే రైల్వే స్టేషన్లలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఒకటి. ఇక్కడి నుంచి వేలాది మంది ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగిస్తూ ఉంటారు. వారిలో ఎవరు ప్రయాణికులు, ఎవరు దోపిడీగాళ్లు అనే విషయాన్ని గుర్తించడంలో ఇటు రైల్వే పోలీసులు, అటు రాష్ట్ర పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. ఇలాంటి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో రద్దీని దృష్టిలో ఉంచుకొని నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఇందుకు గతంలో జరిగిన ఘటనలే ఉదాహరణగా చెప్పవచ్చు. అయితే ఇంకెప్పుడు అలాంటి ఘటనలు జరగకుండా ఉండేందుకు ముఖ కవళికలను గుర్తించి నేరగాళ్లను పట్టించే ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాలను రైల్వేశాఖ ఏర్పాటు చేయనుంది. దేశంలో పైలట్ ప్రాజెక్టు కింద హౌరా, సెల్దా, ఢిల్లీ, ముంబై, ధనపూర్, చెన్నైలతో పాటు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లలను రైల్వేశాఖ ఎంపిక చేసింది. ప్రస్తుతం రూ.720 కోట్లతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను ఆధునీకరిస్తున్న విషయం తెలిసిందే. ఈ పనుల్లో భాగంగానే ఫేషియల్ రికగ్నిషన్ వ్యవస్థ కూడా ఏర్పాటు చేయనున్నారు.


### ఎలా పని చేస్తుంది

నేరాల దర్యాప్తులో నేరగాళ్ల కదలికలు అత్యంత కీలకం. నేరం చేసిన వారు, నేరచరిత్ర ఉన్నవారు రైల్వేస్టేషన్ల ద్వారా పారిపోయేందుకు ప్రయత్నిస్తే వారిని గుర్తించి పట్టుకునేందుకు ఈ ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాలు ఉపయోగపడతాయి. ఇటీవల జరిగిన కుంభమేళాలో ఇలాంటి కెమెరాలనే వాడి పలువురు అనుమానితులను ముందస్తుగానే గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అందుకే ఫేషియల్ రికగ్నిషన్ వ్యవస్థను రైల్వేస్టేషన్లలో ఏర్పాటు చేయాలని రైల్వేశాఖ యోచిస్తోంది. ఇందుకు అవసరమైన డేటాబేస్ నిల్వ కోసం ఇప్పటికే దిల్లీలో రూ. 18 కోట్లతో సెంట్రల్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (సి4)ను నిర్మించింది. అనుమానితులు, నేరగాళ్ల చిత్రాలను ఈ డేటాబేస్‌లో నిక్షిప్త పరుస్తారు. ఏఐ కెమెరాలు వాటి పరిధిలో వచ్చిన నేరగాళ్లను వారి ముఖ కవళికలను బట్టి గుర్తించి వెంటనే సమీప పోలీసులకు సమాచారం చేరవేస్తుంది. ఇదంతా కృత్రిమ మేధ (ఏఐ) ద్వారానే జరుగుతుంది. బెంగళూరు రైల్వే స్టేషన్‌లో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ విధానం ద్వారా 90 రోజుల వ్యవధిలో 47 మంది అనుమానితులను ఇలానే పట్టుకున్నారు. ఈ వ్యవస్థ ఎంత సమర్థంగా పని చేస్తుందంటే నేరస్థులు ముఖానికి మాస్కు ధరించినాసరే ఇట్టే ముఖ కవళిలను గుర్తించి వారిని పోలీసులకు పట్టిస్తోంది. ఇప్పుడు ఈ విధానం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో అందుబాటులోకి రానుంది.

# అమ్మా, నన్ను అమ్మకే ఓయమ్మా,

## పెరుగుతున్న శిశు విక్రయాలు

## కనుమరుగవుతున్న మానవ సంబంధాలు



**మహా :** సృష్టికి జీవం పోసేది అమ్మ. మానవజాతి పురోగతికి పునాది అమ్మ. మానవజాతికి మోక్షం మహిళతోనే సాధ్యం. తల్లిగా, చెల్లిగా, ఆలిగా లాలించి, పాలించి బహు విధాలుగా శ్రమించి, శాసించి, ఓర్పుతో నేర్పుతో సంసారాన్ని చక్క దిద్ది తమ పిల్లలను ప్రయోజకులుగా తీర్చిదిద్దడంలో భర్తకు సహ ధర్మచారినిగా తోడు నీడగా ఉండేది ఆడజన్మ. తల్లి కావాలని ప్రతి స్త్రీ కోరుకుంటుంది. మాతృత్వం స్త్రీలకు ఒక వరం. కడుపు పండిన నాడే స్త్రీ జీవితానికి సార్థకత ఏర్పడుతుంది. తమ సంతానాన్ని కంటికి రెప్పలా కోడి తన పిల్లల్ని శత్రువుల దాడులనుంచి రక్షించుకునే విధంగా కాపాడుతూ వారికి చదువు సంస్కారం నేర్పుతూ మరో తరానికి పునాది గుర్తుగా భర్తతో పాటు నిలిచిపోతుంది. అయితే ఆరోగ్య కారణాల రీత్యా కొందరి తల్లులు మాతృత్వానికి నోచుకోరు. అలాంటి దంపతులు తమకు నచ్చిన వారిని అనాథ శరణాలయాలనుంచి, బంధువుల పిల్లల నుంచి దత్తత తీసుకొని చట్టబద్ధంగా పెంచి పెద్ద చేస్తారు. అలాకాకుండా తల్లి, తండ్రి, ప్రాంతము తెలియకుండా కొందరు శిశువిక్రయాల మధ్య దళారుల చేతిలో చిక్కి డబ్బులు పోసి మరి పిల్లలను కొని సాదుకుంటున్నారు. పిల్లల్ని కొనడం చట్ట విరుద్ధమని, చట్ట ప్రకారం శిక్షింపబడతారని తెలిసినప్పటికీ చాటుమాటుగా చిన్నారులను కొనుగోలు చేసి సంసారాలను వెల్లదీస్తున్నారు. అయితే గుట్టు కాస్త బయటకెక్కి పోలీసులకు చిక్కి ఇన్నాళ్లు పెంచుకున్న చిన్నారులు తమ కళ్ళముందే పోలీసులు తీసుకెళ్తుంటే చూసి కన్నీటి పర్యంతం అవుతున్నారు. కన్న ప్రేమ కానప్పటికీ పెంచిన ప్రేమ పేగు బంధం కంటే గొప్పగా భావించి ఇన్నేళ్లుగా పెంచిన పిల్లలు తమను విడిచి వెళ్తుంటే గుండెలు బాదుకుంటూ రోధిస్తున్నారు. ఇలాంటి హృదయపూర్వక ఘటన ఇటీవల హైదరాబాదులోని ఉప్పల్ ప్రాంతంలో జరుగగా, తాజాగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోనూ చోటుచేసుకుంది. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అని ఏనాడో చెప్పిన మార్క్సిస్టు మహనీయుడు కారల్ మార్క్స్ అన్న మాటలు నేడు అక్షర సత్యాలు అవుతున్నాయి. కంటికి రెప్పలా కాపాడుకున్న చిన్నారులు తమను విడిచి వెళ్తుంటే మీడియా ముందు బాధనంతా వెళ్లబోసుకొని ఏడవడం తప్ప ఆ గ్రామీణ ప్రాంతపు అమాయక జీవులకు ఏమి తెలుసు. పోలీస్ వారు కూడా ప్రతి గ్రామంలోనూ శిశు విక్రయాలు నేరమని, ఎవరు చిన్న పిల్లల్ని అమ్మడం గాని, కొనడం గాని చేయవద్దని పలు రకాలుగా సభలు, సమావేశాలు పెట్టి గ్రామీణ ప్రాంతాల వారికి విస్తృతంగా ప్రచారం చేసి తెలియజేయాల్సిన అవసరం ఉంది.

**డబ్బు పెట్టి కొని పెంచిన చిన్నారులను పోలీసులు తీసుకెళ్తుంటే గుండెలు అవిసేలా తల బాదుకుంటూ ఏడుస్తూ**

పలు ఆరోగ్య కారణాల రీత్యా సంతానం లేని దంపతులు శిశువిక్రయాల ముఠాల బారినపడి నలిగిపోతున్నారు. ఎలాగైనా తమకు ఒక ఆడపిల్లగాని, వంశాన్ని ఉద్ధరించే వంశోద్ధారకుడు గాని శిశువిక్రయాల దందా నడిపే దళారీలు ఎక్కడో ప్రాంతం నుంచి తీసుకువచ్చిన చిన్నారులను అమ్ముతున్న సందర్భంలో రహస్యంగా కొంటూ పెంచుకుంటున్నారు. ఇలాంటి మానవ అక్రమ రవాణా చట్ట విరుద్ధమని తెలిసినప్పటికీ సంతానం కావాలని ఒకే ఒక బలీయమైన కోరిక దళారుల వలన చిక్కుకునేలా చేస్తుంది. లక్షలాది రూపాయలు వెచ్చించి కొన్నేళ్లుగా కన్న బిడ్డల కంటే గొప్పగా చూసుకుంటూ పెంచుకుంటూ అల్లారు ముద్దుగా కళ్ళ ముందు తిరగాల్సిన చిన్నారులను ఒక్కసారిగా శిశు విక్రయాల మూఠా గుట్టు రట్టు కావడంతో పోలీసులకు చిక్కి చిన్నారులను ఎక్కడెక్కడ ఎవరెవరికి ఎంతకు విక్రయించారు తెలుసుకొని ఆయా ప్రాంతాలకు వచ్చి ఇన్నాళ్లుగా పెంచిన చిన్నారులను తీసుకెళ్తుంటే కన్న తల్లిదండ్రులు కానీ పెంచిన తల్లిదండ్రుల బాధలు వర్ణనాతీతం. తమ పిల్లలను పోలీస్ స్టేషన్కు తీసుకు వచ్చిన సందర్భంలో పెంచుకున్న తల్లిదండ్రులే కాకుండా బంధువులు మిత్రులు కుటుంబ సభ్యులు అందరూ పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చి మీడియా ముందు కన్నీరు మున్నీరు అవుతున్న ఒక దుఃఖ సాగరాన్ని ఆపటం ఎవరు తరం కాలేదు.

**ఎక్కువ సంతానం, డబ్బుపై ఆశ పిల్లల్ని అమ్మేలా చేస్తుందా...?**


నేటికీ సమాజంలో నెలకొన్న నిరక్షరాస్యత, తట్టుకోలేని పేదరికం, పూట గడవని ఆర్థికలేమి, పిల్లలు ఎక్కువగా కంటే సాదలేని బాధలు, ఆడపిల్లలు ఎక్కువమంది ఉంటే పెంచి పెద్ద చేసి పెళ్లి చేయలేమనే బెంగ ఇలా పలు రకాల కారణాల వల్ల కొందరు తమ సంతానాన్ని అంగట్లో సరుకులాగా ఎంతకో ఒకంతకు అమ్మేసుకుంటూ వదిలేసుకోవడం నిజంగా ఒక మానవత్వానికి మాయని మచ్చ, మానని గాయం. ఇదే అదనుగా పేద తల్లిదండ్రుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకున్న శిశు విక్రయ ముఠాలు మాయమాటలతో సదరు తల్లిదండ్రులను బుట్టలో వేసుకొని ఎంతో కొంత ముట్టజెప్పి వేరే ప్రాంతంలో కమిషన్లకు అధిక ధరకు అమ్ముకొని చిన్నారులతో వ్యాపారం సాగుతుండటం ఈ ఆధునిక సమాజానికి ఓ సిగ్గుచేటుగా చెప్పుకోవచ్చు. సంతలో పశువుల్ని కొన్నట్టుగా మనుషుల్ని కూడా కొనుగోలు చేయడం, అందులోనూ అన్నం పుణ్యం ఎరగని అమాయక తల్లిదండ్రులను పలు రకాలుగా మాయ మాటలు చెప్పి మీరు పిల్లల్ని పెంచుకోలేరు, ఇతరులకు ఇస్తే అధిక ధనవంతులు అవుతారు అనే భ్రమ కల్పించి డబ్బులు ముట్టజెప్పి మరీ పిల్లల్ని తీసుకువచ్చి లక్షలాది రూపాయలకు అమ్మేస్తున్నారు. సంతానం ఎక్కువగా ఉన్న పేద తల్లిదండ్రులు కొంతమంది పిల్లలను ఈ విధంగా శిశు విక్రయ ముఠాల వారికి అమ్మడం నిజంగా ఆ తల్లిదండ్రులకు తీరని గర్భశోకం అయినప్పటికీ ఈ సమాజంలో ఇంకా ఇలాంటి రుగ్మతలు కొనసాగడం యావత్ మానవజాతికి ఒక మచ్చగా చెప్పుకోవచ్చు. కనులు కూడా తెరవని పసి గుడ్డులను, రక్త మాంసాల ముద్దలుగా గుడ్డలు చుట్టి లక్షలకు రూపాయలకు అమ్ముకునే తల్లిదండ్రులు ఉండటం సమాజంలో ఏం సంస్కారం నేర్పుతుంది అనేది పలువురు ప్రశ్నిస్తున్నారు. అలాగే మానవజాతి మనుగడకు పునాదిగా ఉండాల్సిన చిన్నారుల విక్రయాలపై బతుకుతున్న దళారుల ముఠాలు ఈ సమాజంలో కొనసాగటం ఇంకా విచారకరం,ఆశ్చర్యకరం. అవినీతికరం. అయోమయం.

**కఠిన చట్టాలు ఎన్ని ఉన్నా కట్టడి చేయలేకపోతున్నామా...!!**
**మానవ ఆలోచనలతోనే మార్పు సాధ్యమా...?**

ఈ ఆధునిక వ్యవస్థలో పోలీసింగ్ ప్రతిష్టంగా ఉంది. డిజిటల్ టెక్నాలజీ యుగంలో బతుకుతున్న మానవజాతి ఆకాశంలో నిర్మాణాలు కొనసాగించేలా టెక్నాలజీ రూపుదిద్దుకుంటుంది. అయితే మానవ మేధస్సు ఎంత గొప్పగా అభివృద్ధి చెందినప్పటికీ మనిషి ఆలోచనలు మాత్రం ఇంకా మోకాళ్ళ కిందికి ఉంటున్నాయి. మానవ అక్రమ రవాణా అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వాలు ఎన్ని కఠిన చట్టాలు తీసుకు వస్తున్నప్పటికీ అంతకంటే చట్టానికి చిక్కకుండా శిశు విక్రయ దళారీ వ్యవస్థ నానాటికి రూపాంతరం చెందుతుంది. పోలీసింగ్ పటిష్టంగా ఉండి అలాంటి చట్ట వ్యతిరేక శక్తుల్ని ఎప్పటికప్పుడు న్యాయస్థానంలో నిలబెడుతూనే ఉన్నప్పటికీ ప్రజల ప్రవర్తన, ఆలోచనలు మార్పు రానంతకాలం కేవలం పోలీసులే అరికట్టాలంటే అది సాధ్యం కాదేమో అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ఎక్కడ ఏమి జరిగినా, చీమ చిటుక్కుమన్నా క్షణాల్లో చర్యలు పోలీసులు తీసుకోవడం వలననే ఇలాంటి శిశు విక్రయ ముఠాల పనిబడుతూ ఆటగట్టిస్తున్నారు. అయితే ఎందుకు కేవలం పోలీసులనే కాకుండా ఇందుకు కారకులు అవుతున్న మానవుల ప్రవర్తన, ఆలోచనలో శిశువులను కొనుగోలు చేయవద్దు అనే అభిప్రాయం వచ్చిన నాడే ఇలాంటి శిశు విక్రయాల చర్యలకు అడ్డుకట్ట వేస్తాం. ఒకవేళ సంతానం లేని దంపతులు తమకు పెంచుకోవడానికి పిల్లలు కావాలంటే చట్టబద్ధంగా దత్తత తీసుకొని పెంచుకోవచ్చు. చట్టపరంగా దత్తత తీసుకోవడం వలన ఎలాంటి పోలీసు, న్యాయపరమైన చిక్కులు ఎదురుగావు. చట్టబద్ధంగా వ్యవహరించి చిన్నారులను పెంచుకుంటే పెంచుకున్న వారికి ఎలాంటి బెంగ ఉండాల్సిన అవసరం లేదు. అలా సంతానం లేని దంపతులు ఆలోచించి చట్టబద్ధంగా చిన్నారులను తీసుకొని దత్తత ప్రకారం పెంచుకుంటే భవిష్యత్తులో ఎలాంటి చిక్కులు ఎదురుగావని, ఆ విధంగా చట్టప్రకారం ముందుకెళ్లవచ్చని పోలీసులు వెల్లడిస్తున్నారు. పెంచిన పిల్లలను దూరం చేస్తున్నామనే భావన పోలీసులలో ఉన్నప్పటికీ చట్ట ప్రకారం వ్యవహరించాల్సి వస్తుందని, పోలీసులు కూడా చట్టానికి అతీతులు కాదని, చట్ట ప్రకారం పోలీసులు వారి పని వారు చేసుకుంటూ పోతారని, ఇన్నాళ్లు పెంచిన చిన్నారులను తీసుకెళ్లినప్పుడు కొంత పెంచిన బంధం బాధ పెడుతూనే ఉంటుందని, అయినప్పటికీ శిశువిక్రయ ముఠాలనుంచి చిన్నారులను కొని పెంచుకుంటున్న తల్లిదండ్రులు చట్టాన్ని గౌరవించాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

**దళారులూ ఆలోచించండి**

శిశు విక్రయ దళారుల ఆటలు నానాటికి పెరిగిపోతున్నాయి. దళారుల ముఠాలు పెట్రేగి పోతున్నాయి. కన్న పేగు బంధాన్ని తెంపేసి, కొన్ని సందర్భాల్లో డబ్బులు ఇచ్చి తీసుకువచ్చి, మరి కొన్ని సందర్భాల్లో చిన్నారులను కిడ్నాప్ చేసి తీసుకువచ్చి ఇతరులకు లక్షలాది రూపాయలకు అమ్ముకునే శిశు విక్రయ ముఠా సభ్యులు మానవత్వంతో ఆలోచించాల్సిన అవసరం ఉంది. అక్కడ తల్లిదండ్రులకు బిడ్డలను దూరం చేస్తున్నారు. ఇక్కడ అమ్మి కొన్నాళ్లకు పోలీసులకు తెలిస్తే సదరు చిన్నారులను పోలీసులు తీసుకెళ్తే డబ్బులు ఇచ్చి కొనుగోలు చేసిన పెంచిన తల్లిదండ్రులు అన్యాయానికి గురవుతున్నారు. గుండె కోతకు గురవుతున్నారు. గుండెలు బాదుకుంటూ రోధిస్తున్నారు. ఇక్కడ ఆర్థికంగా బాగుపడ్డదల్లా శిశు విక్రయాలను అమ్ముకున్న దళారుల ముఠా మాత్రమే. సమాజంలో బతకడానికి ఎన్నో వృత్తులు ఉన్నాయి. అయితే మానవ సంబంధాలను మంటగలిపేలా చిన్నారులను అమ్మడం అనేది, మానవ అక్రమ రవాణా అనేది క్షమించరాని నేరంగా పరిగణించవచ్చు. కేవలం శిశువిక్రయాలను జరిపి బతకటం అంటే కన్న తల్లిదండ్రుల, పెంచిన తల్లిదండ్రుల కడుపు తీపిని, పెంచిన మమతానురాగాలను మంట కలపటమే. అందుకే ఇలాంటి సమాజం సిగ్గుపడే చర్యలను చేష్టలను శిశువిక్రయ ముఠాలు చేయకుండా ఉండి తాము మానవత్వం కలిగిన మనుషులమే అని కష్టించి పనిచేసే బతకాలి తప్పించి ఇలాంటి అన్నం పుణ్యం ఎరుగని అమాయక బాలలను అమ్మి బతకడం ఒక బతుకేనా అని పలువురు దుమ్మెత్తి పోస్తున్నారు. అందుకే ఇలాంటి సమాజ రుగ్మతలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి భారత పౌరుడుపై ఉంది. ఇలాంటి సంఘటనలు ఎప్పుడైనా ఎవరికైనా దృష్టికి వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం తెలిపి ప్రజాస్వామ్య భారతంలో ఒక బాధ్యత గల పౌరుడిగా ప్రతివారు వ్యవహరించాలని, చిన్నారుల అమ్మకాలను అడ్డుకునేలా ప్రతివారు కృషి చేయాలని మనము ఆశిద్దాం.



## మాదాపూర్ లో యువకుడి దారుణ హత్య

**మహా :** మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం అర్ధరాత్రి దారుణ ఘటన చోటు చేసుకుంది. యశోద ఆసుపత్రి వెనకాల ఉన్న ప్రాంతంలో నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు దోపిడీకి పాల్పడి, ఇద్దరు యువకులపై కత్తులతో దాడి చేశారు. ఈ ఘటనలో ఒక యువకు డు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాల్లోకి వెళితే.. మణికొండ ప్రాంతానికి చెందిన జయంత్ గౌడ్ అనే యువకుడి తన తల్లి పుట్టిన రోజు సెలబ్రేషన్ ను స్నేహితులతో కలిసి జరుపు కోవాలని భావించాడు. స్నేహితులతో కలిసి మాదాపూర్ లోని యశోద హాస్పిటల్ వెనక ఉన్న ప్రాంతంలో కేక్ కట్ చేసి సెలబ్రేషన్ చేసుకుంటుండగా ఆ దారిలోనే వస్తున్న నలుగురు దుండగులు వారి దగ్గరికి వెళ్లి మద్యంతో పాటు బంగారం, డబ్బులు ఇవ్వాలని బెదిరించారు. వారు ప్రతిఘటించడంతో ఆగ్రహానికి గురైన దుండగులు వెంట తెచ్చుకున్న కత్తులతో విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో మణికొండ ప్రాంతానికి చెందిన జయంత్ గౌడ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మరో యువకుడికి కూడా తీవ్ర గాయాలు కావడంతో, అతన్ని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ దారుణ ఘటనపై సమాచారం అందుకున్న మాదాపూర్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నగర నడిబొడ్డున జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# సర్కార్ బడుల్లో ఉపాధ్యాయుల తాత్కాలిక సర్దుబాటు

## కీలక నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం

**మహా :** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో మిగులు టీచర్లను అవసరమైన స్కూళ్లకు సర్దుబాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. స్కూళ్లో విద్యార్థుల నమోదు సబ్జెక్టుల వారిగా అవసరాలను విశ్లేషించి ఉపాధ్యాయులను జిల్లా పరిధిలోనే సర్దుబాటు చేయడానికి జిల్లా కలెక్టర్లకు అధికారాలు ఇస్తూ విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, ఉత్తర్వులు జారీచేశారు. సర్దుబాట్లు పూర్తిగా తాత్కా లికమైనవేనని, బదిలీలుగా పరిగణించబోరని పేర్కొ న్నారు. టీచర్ల జీతాలు వారి పాత స్టేషన్ నుండే చెల్లిస్తారని స్పష్టంచేశారు. సర్దుబాటు చేసిన టీచర్లు జూన్ 13లోగా కొత్త పాఠశాలలో రిపోర్టు చేసి విధులను ప్రారంభించాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు సర్దుబాటు చేసిన టీచర్ల వివరాలను జూన్ 30లోగా డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు సమర్పించాలని తెలిపారు. మిగులు టీచర్లను గుర్తించేటప్పుడు సీనియారిటీని గుర్తించాలని సూచించారు. గిరిజన ప్రాంత టీచర్లను సాధారణ ప్రాంతాలకు సర్దుబాటు చేయొద్దని సూచించారు. ప్రభుత్వ స్కూళ్లలో ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి 1:17గా ఉన్నప్పటికీ, పాఠశాలల వారీగా చూస్తే అసమానతలు ఉన్నాయని గుర్తిం చారు. ఈ సమస్య ను పరిష్కరించడానికి ఈ ప్రమాణాలను అనుసరిం చాలని ఆదేశించారు.

ప్రాథమిక లేదా అప్పర్ ప్రైమరీ విభాగాల్లో 1 నుంచి 10 మంది విద్యార్థులకు ఒక టీచర్, 11 నుంచి 60 మంది విద్యార్థులకు ఇద్దరు, 61 నుంచి 90 మంది విద్యార్థులకు ముగ్గురు, 91 నుంచి120 మంది విద్యార్థులకు నలుగురు, 121 నుంచి 150 మంది విద్యార్థులకు ఐదుగురు, 151 నుంచి 200 మంది విద్యార్థులకు ఆరుగురు, 200మంది విద్యార్థుల తర్వాత ప్రతి 40 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉండాలని సూచించారు. అప్పర్ ప్రైమరీ పాఠశాలల్లో (6వ, 7వ, 8వ తరగతులు) 1 నుంచి 20 మంది విద్యార్థులకు ఇద్దరు సబ్జెక్టు టీచర్లు అందులో ఒకరు లాంగ్వేజ్, మరొకరు నాన్ లాంగ్వేజ్ టీచర్లు ఉండాలి. 21 కంటే ఎక్కువ మంది విద్యార్థులకు నలుగురు సబ్జెక్టు టీచర్లు ఉండాలని తెలిపారు..

# ప్రతి ఫిర్యాదును నమోదు చేయాల్సిందే

## కేసుల సంఖ్య పెరుగుతుందన్న ఆలోచన వద్దు.. ఎస్ హెచ్ వోలతో డీజీపీ జితేందర్

## గోవుల అక్రమ రవాణా అరికట్టాలి : అదనపు డీజీపీ మహేష్ ఎం భగవత్

**మహా :** వివిధ రకాల సమస్యలతో పోలీస్ స్టేషన్లలో బాధితులు అందజేస్తున్న ఫిర్యాదులను ఖచ్చితంగా నమోదు చేయాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేందర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలోని వివిధ యూనిట్ల నుండి వచ్చిన స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో శనివారం డీజీపీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.... శాంతి భద్రతల సమస్యలు ఎదురైనప్పుడు ప్రజలు పోలీస్ స్టేషన్ కి వస్తారని వారు ఇస్తున్న ఫిర్యాదులను నమోదు చేసి దర్యాప్తు చేయాలన్నారు. దీనివల్ల కేసుల సంఖ్య పెరుగుతుందేమో అనే సందేహాలు పెట్టుకోవద్దని కేసులు పెరిగినప్పటికీ పోలీసు అధికారులు స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఎవరూ ప్రశ్నించరని తెలిపారు. కేసులు నమోదు చేసిన తర్వాత దర్యాప్తులో వాస్తవాలను తెలుసుకొని బాధితులను రక్షించి నిందితులకు శిక్ష పడేలా చేయాలనే క్రిమినల్ జస్టిస్ సిస్టంను పాటించాలని, తద్వారా ఉత్తమ పోలీస్ అధికారులుగా పేరు తెచ్చుకోవాలని సూచించారు. బాధితులకు సరైన న్యాయం జరగనప్పుడు మాత్రమే వారు వివిధ రకాల వ్యక్తుల దగ్గరికి వెళ్లి తిరిగి పోలీస్ స్టేషన్ కే సిఫారసులు తీసుకొస్తారని, ముందుగానే బాధితులకు న్యాయం చేయడం ద్వారా ప్రజల్లో అభిమానాన్ని, విధి నిర్వహణలో సంతృప్తిని పొందవచ్చు అన్నారు. రాష్ట్ర పోలీసులు పౌర ఆధారిత పోలీసింగ్ చేయడం ద్వారా ప్రజలకు మేలు చేయవచ్చని పేర్కొన్నారు.

# పాకిస్థాన్ ఒక విష సర్పం

## అబద్ధాలతే కాలం గడుపుతుంది

### మాజీ కేంద్ర మంత్రి ఎంజే అక్బర్ తీవ్ర విమర్శలు
### అబద్ధాలు, కపటనీతి ఉన్న దేశంతో చర్చలు కష్టమంటూ వ్యాఖ్య
### పీఓకేను తిరిగి తీసుకోవడంపైనే చర్చలని స్పష్టం
### కోపెన్‌హాగన్‌లో ప్రవాస భారతీయుల సమావేశంలో ఈ వ్యాఖ్యలు

**మహా :** విదేశాంగ శాఖ మాజీ సహాయ మంత్రి ఎంజే అక్బర్, పాకిస్థాన్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ దేశాన్ని ఒక విషసర్పంతో పోలుస్తూ, అబద్ధాలతో కాలం గడిపే, కపటనీతి కలిగిన పాక్‌తో చర్చలు జరపడం దాదాపు అసాధ్యమని ఆయన స్పష్టం చేశారు. కోపెన్‌హాగన్‌లో ప్రవాస భారతీయులతో జరిగిన ఓ సమావేశంలో మాట్లాడుతూ, పాకిస్థాన్ విషయంలో భారత్ వైఖరిని ఆయన గట్టిగా సమర్థించారు. ప్రస్తుతం బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ నేతృత్వంలోని విపక్ష బృందంతో పాటు విదేశాల్లో పర్యటిస్తున్న ఎంజే అక్బర్, పాకిస్థాన్‌తో చర్చల ప్రస్తావనపై కీలక వ్యాఖ్యలు చేశారు. "కొంతమంది మిత్రులు పాకిస్థాన్‌తో భారత్ ఎందుకు చర్చలు జరపడం లేదని అడుగుతున్నారు. అసలు అక్కడ ఎవరితో చర్చలు జరపాలి? చిత్తశుద్ధి లేని, ఇచ్చిన మాటను నిలబెట్టుకోని ప్రభుత్వం అక్కడ ఉంది. విషపు నాలుక కలిగిన ఆ ప్రభుత్వంతో మాట్లాడటం వల్ల ఎవరికి నష్టం?" అని అక్బర్ ప్రశ్నించారు. సర్పం ఎన్నడూ తన విషంతో తాను చనిపోదని, దాని విషం ఇతరులకే హాని చేస్తుందని ఆయన చురక అంటించారు.



దేశంలో దీర్ఘకాలంగా నెలకొన్న అశాంతికి పాకిస్థానే ప్రధాన కారణమని ఎంజే అక్బర్ ఆరోపించారు. కేవలం సాకులుగా మారిన అంశాలపై చర్చల పేరుతో భారత్ తన విలువైన సమయాన్ని వృథా చేసుకోబోదని ఆయన తేల్చిచెప్పారు. చర్చల కోసం కేటాయించే సమయాన్ని కూడా పాకిస్థాన్ మరో ఉగ్రదాడికి ప్రణాళిక రచించుకోవడానికి వాడుకుంటుందని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పాకిస్థాన్ నోట వెలువడే చర్చల మాట కేవలం బూటకమని, అందులో ఎలాంటి నిజాయితీ లేదని అక్బర్ అన్నారు. అంతేకాకుండా, ఒకవేళ చర్చలు జరపాల్సి వస్తే, అవి కేవలం పీఓకేను తిరిగి స్వాధీనం చేసుకునే అంశంపైనే ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. అంతకు మించి వేరే అంశాలపై చర్చలకు ఆస్కారం లేదని అన్నారు

## ఎన్ కౌంటర్ లకు నిరసనగా
# 10న భారత్ బంద్‌కు మావోయిస్టుల పిలుపు
## జూన్ 11 నుంచి ఆగస్టు 3 వ తేదీ వరకు అమరుల స్మారక సభలు

**మహా :** జూన్ 10వ తేదీన భారత్ బంద్‌కు మావోయిస్టులు పిలుపునిచ్చారు. 27 మంది మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌కు నిరసనగా ఈ బంద్ చేపట్టనున్నట్లు తెలిపారు. జూన్ 11వ తేదీ నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు అమరుల స్మారక సభలు నిర్వహిస్తున్నట్లు మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రకటించింది. 2024 నుంచి ఇప్పటి వరకు 540 మంది మావోయిస్టులు మృతి చెందారని వెల్లడించింది. శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించినా కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ ఎందుకు ఆపడం లేదని మావోయిస్టులు ప్రశ్నించారు. 2 నెలలుగా తాము సంయమనం పాటించామని చెప్పుకొచ్చారు. కేంద్ర, రాష్ట్రాల ఫాసిస్ట్ వైఖరికి నిరసనగా బంద్ పాటిస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు మావోయిస్టు కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ మూడు పేజీల లేఖను విడుదల చేశారు. కాగా మే 21 వ తేదీన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లాలో మావోయిస్టుల ఎన్‌కౌంటర్ జరిగిన విషయం తెలిసిందే. ఈ ఎన్‌కౌంటర్‌లో 28 మంది చనిపోయారు. వారిలో మావోయిస్టు కీలక నేత నంబాల కేశవ రావు అలియాస్ బసవరాజు కూడా ఉన్నారు. ఆయన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందడంతో మావోయిస్టుల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. పక్కా సమాచారంతోనే మాఢ్ ప్రాంతాన్ని పోలీసుల భద్రతా బలగాలు చుట్టుముట్టాయని మావోలు భావిస్తున్నారు. ఈ ఎన్‌కౌంటర్‌కు నిరసనగానే మావోయిస్టు కేంద్ర కమిటీ భారత్ బంద్‌కు పిలుపునిచ్చింది.








# ప్రపంచ సుందరి ఓపల్ సుచాతా..

## మిస్ వరల్డ్ కిరీటం దక్కించుకున్న థాయ్‌లాండ్ భామ

## విజేతకు 8.5 కోట్ల ప్రైజ్ మనీ

- ఫస్ట్ రన్నరప్‌గా మిస్ పోలెండ్, సెకండ్ రన్నరప్‌గా మిస్ పోలాండ్
- మూడో రన్నరప్‌గా నిలిచిన మిస్ మార్టినిక్
- పోటీల్లో పాల్గొన్న 108 దేశాల అందగత్తెలు
- 72వ ప్రపంచ సుందరి పోటీలకు వేదికైన తెలంగాణ
- హైటెక్స్ లో గ్రాండ్ గా సాగిన మిస్ వరల్డ్ ఫైనల్
- ఫైనల్స్‌కు హాజరైన సీఎం రేవంత్, మంత్రులు, సినీ ప్రముఖులు





**మహా:** మిస్ వరల్డ్ 2025 గ్రాండ్ ఫినాలేలో థాయిలాండ్ ప్రతినిధి ఓపల్ సుచాతా చువాంగ్‌శ్రీ మిస్ వరల్డ్ 2025 విజేతగా నిలిచారు. ఓపల్ సుచాతా మిస్ థాయిలాండ్ వరల్డ్ 2023గా ఎంపికయ్యారు. మిస్ యూనివర్స్ 2024లో మూడవ రన్నర్‌అప్‌గా నిలిచారు. ఆమె ఆకర్షణీయమైన వ్యక్తిత్వం, బలమైన స్టేజ్ ప్రెజెన్స్, సామాజిక కారణాల పట్ల నిబద్ధతకు సరైన గౌరవం దక్కింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జూలియా మోర్లీ, క్రిస్టినా పిజ్కోవా చేతుల మీదుగా విజేతగా నిలిచిన ఓపల్ సుచాత కిరీటాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు అభినందనలు వెల్లువెత్తాయి. ఈ పోటీల్లో రెండవ స్థానంలో ఇథియోపియా, మూడో ప్లేస్‌లో పోలాండ్, నాలుగవ స్థానంలో మార్టినిక్ సుందరీమణులు నిలిచారు. విజేతగా నిలిచిన ఓపల్ సుచాతాకు 8.5 కోట్ల ప్రైజ్ మనీ దక్కుతుంది. మీరు మిస్ వరల్డ్‌గా ఎన్నికైతే ఏం చేస్తారు అని జడ్జిలు అడిగిన ప్రశ్నలకు.. సామాజిక సేవా నిబద్ధత, ముఖ్యంగా విద్య, మానసిక ఆరోగ్యం గురించి ఆమె చేస్తున్న కృషిని కొనసాగిస్తానని ప్రభావవంతంగా చెప్పారు.

### ఓపల్ సుచాత నేపథ్యం..

ఓపల్ సుచాత సువాంగ్ థాయ్‌లాండ్‌లోని ఫుకెట్ లో(2003) జన్మించారు. ఈమె గతంలో మిస్ యూనివర్స్ థాయిలాండ్ 2024 కిరీటాన్ని గెలుచుకున్నారు. అంతేకాకుండా మిస్ యూనివర్స్ 2024 పోటీలో థాయిలాండ్‌కు ప్రాతినిధ్యం వహించారు. ఈ పోటీల్లో మూడవ ప్లేస్ లో నిలిచారు. తాజాగా జరిగిన మిస్ వరల్ట్ 2025 పోటీల్లో గెలిచి... ప్రపంచ సుందరీగా నిలిచారు.

### ప్రైజ్ మనీ వివరాలు..

తెలంగాణ ప్రభుత్వ సాకారంతో హైదరాబాద్ వేదికగా మిస్ వరల్డ్ పోటీలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇందులో పాల్గొనేందుకు సుమారు 108కి పైగా దేశాల నుంచి సుందరీమణులు తరలివచ్చారు. వీరిలో థాయిలాండ్ కు చెందిన సుందరీమణి విజేతగా నిలిచింది. దీంతో ఆమె 72వ మిస్ వరల్డ్ కిరీటం దక్కించుకున్నారు. మిస్ వరల్డ్ విజేతగా నిలిచిన ఓపల్ సుచాతకు 1 మిలియన్ డాలర్ల ప్రైజ్ మనీ దక్కుతుంది. అంటే మన కరెన్సీలో చెప్పాలంటే 8.5 కోట్ల రూపాయలు. ఈ ప్రైజ్ మనీని మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ తో పాటు ప్రధాన స్పాన్సర్ల ద్వారా లభిస్తుంది. అంతేకాకుండా వజ్రాలతో చేసిన కిరీటాన్ని స్వీకరించారు. మిస్ వరల్డ్ 2024ను క్రిస్టినా పిజ్కోవా గెలుచుకున్న సంగతి తెలిసిందే.

### దాదాపు నెల రోజుల పాటు..

అంతకుముందు ఏడాది మిస్ వరల్డ్ 2024 క్రిస్టినా పిజ్కోవా దక్కించుకున్నారు. 2023 మిస్ వరల్డ్ విజేత పోలాండ్‌కు చెందిన కరోలిన్ బైలవ్‌స్కా ఆమెకు అందజేశారు. దీంతో తాజాగా గెలుపొందే 72వ ప్రపంచ సుందరికి క్రిస్టినా పిజ్కోవా కిరీటాన్ని ధరింపజేస్తారు. తెలంగాణలో దాదాపు నెల రోజుల పాటు సాగిన మిస్ వరల్డ్ పోటీలు తుదిపోరుకు చేరాయి. ఇందులో చారిత్రక ప్రదేశ పర్యటన, ఆధ్యాత్మికత వెల్లివెరిసేలా ఆలయాల దర్శనం, మెడికల్ టూరిజం ప్రోత్సహించే కార్యక్రమాలు, స్పోర్ట్స్ మీట్‌లు, గాలా డిన్నర్‌లతో ఆకట్టుకునేలా కార్యక్రమాలకు రూపొందించారు.

### విజేత ఎంపిక ప్రక్రియ, బహుమతులు..

టాప్ 8 నుంచి న్యాయనిర్ణేతలు అడిగిన ప్రశ్నలకు మెరుగైన సమాధానాలు ఇచ్చిన అనంతరం టాప్ 4 ఎంపికయ్యారు. థాయ్‌లాండ్, పోలండ్, మార్టినిక్, ఇథియోపియా టాప్ 4కి చేరగా, ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన థాయ్‌లాండ్ సుందరి ఓపల్ సుచాత విజేతగా నిలిచి మిస్ వరల్డ్ 2025 కిరీటాన్ని కైవసం చేసుకుంది. మిస్ వరల్డ్ విజేతకు రూ. 8.5 కోట్ల నగదు బహుమతి, 1770 క్యారెట్ల వజ్రాల కిరీటం, మరియు ఏడాది పాటు ఉచితంగా ప్రపంచ యాత్ర సౌకర్యం కల్పించనున్నారు. ఈ బహుమతులు విజేతకు ప్రపంచ స్థాయిలో గుర్తింపుతో పాటు, సామాజిక కార్యక్రమాలలో పాల్గొనే విస్తృత అవకాశాన్ని అందిస్తాయి.

## మిస్ వరల్డ్ పోటీలు గ్రాండ్ సక్సెస్

### మంత్రి జూపల్లి కృష్ణారావు హర్షం



హైదరాబాద్ వేదికగా తెలంగాణ పర్యాటక ప్రమోషన్, సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించడమే లక్ష్యంగా నిర్వహించిన మిస్ వరల్డ్ 2025 పోటీలు విజయవంతం కావటంపై పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో, దిశానిర్దేశంతో అత్యంత ప్రతిష్టాత్మకమైన మిస్ వరల్డ్ వేడుకలను తెలంగాణలో ఘనంగా నిర్వహించడం గొప్ప విషయమన్నారు. మిస్ వరల్డ్ ఈవెంట్‌ను అపూర్వ విజయంగా నిలిపిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. మిస్ వరల్డ్ సంస్థ, ప్రపంచ వ్యాప్తంగా పాల్గొన్న పోటీదారులు, అధికారులు, అవిశ్రాంతంగా శ్రమించిన బృందాలు, విభాగాలు సహాయకుల అసమానమైన అంకితభావం, సమన్వయంతో కృషి చేసిన వారికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. అన్ని ప్రభుత్వ విభాగాలు సమగ్ర కార్యాచరణ, సమన్వయంతో నిర్విరామంగా కృషి చేయడం వల్ల ఈ ఈవెంట్ ఇంత గ్రాండ్ సక్సెస్ అయిందని చెప్పారు. మీ అందరి సహకారంతో తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చెప్పగలిగామని పేర్కొన్నారు. సాంస్కృతిక వినిమయాన్ని ప్రోత్సహించే, తెలంగాణను ప్రపంచ స్థాయి గమ్యస్థానంగా నిలిపే అంతర్జాతీయ కార్యక్రమాలను నిర్వహించేందుకు తెలంగాణ రాష్ట్రం సదా సమాయత్తంగా ఉంటుందని మంత్రి పునరుద్ఘాటించారు. ఇదే అంకిత భావంతో తెలంగాణ పర్యాటకాన్ని మరింత ప్రమోట్ చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. 2025 మిస్ వరల్డ్ విజేతకు మంత్రి జూపల్లి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

## మిస్ వరల్డ్ గ్లోబల్ అంబాసిడర్‌గా మేఘా సుధా రెడ్డి

**హైదరాబాద్, మహా**

మిస్ వరల్డ్ పోటీలు ఫైనల్‌కు వచ్చిన సమయంలో హైదరాబాద్‌లోని హై ప్రొఫైల్ వర్గాల్లో ఎక్కడా లేనంత బజ్ వచ్చేసింది. ఆసక్తి ఏర్పడింది. ధనవంతులు, ఫ్యాషన్ ప్రియులు అంతా హైటెక్స్ లోనే కొలువుదీరారు. అందరిలోనూ ప్రత్యేకంగా మేఘా గ్రూప్ సుధారెడ్డి నిలిచారు. ఆమెను మిస్ వరల్డ్ గ్లోబల్ అంబాసిడర్ గా నియమించారు. ఈ నియామకం సందర్భంగా జ్ఞాపికను మిస్ వరల్డ్ సిఈఓ జూలియా మోర్లీ అందించారు. తనను నియమించినందుకు చాలా ఆనందంగా ఉందని సుధారెడ్డి అన్నారు. అద్భుతమైన ఏర్పాట్లకు తెలంగాణ ప్రభుత్వానికి, టూరిజం శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. మేఘా సుధారెడ్డికి ఫ్యాషన్ పై ప్రత్యేకమైన ఆసక్తి ఉంది. మిస్ వరల్డ్ పోటీల విషయంలో ఆమె పెద్ద ఎత్తున ఖర్చు పెట్టి కొన్ని కార్యక్రమాలనూ నిర్వహించారు. తన ఇంట్లో 'బ్యూటీ విత్ ఏ పర్పస్' గాలా విందు కూడా ఇచ్చారు. ఈ విందుకు దేశంలోని రాజ కుటుంబాల ప్రతినిధులు హాజరయ్యారు. చాలా హై రేంజ్ లో ఈ పార్టీ జరిగింది. అలాగే ముఖ్యమైన కార్యక్రమాలకూ స్పాన్సర్ షిప్ ఇచ్చారు. అందుకే గ్లోబల్ అంబాసిడర్ గా నియమించారు. గతంలో అమెరికాలో జరిగే మెట్ గాలా వేడుకల్లోనూ సీటు రిజర్వ్ చేసుకుని వెళ్లారు. ఆమె కోసం మేఘా కృష్ణారెడ్డి ప్రత్యేకమైన ఫ్యాషన్ కార్యక్రమాలకు స్పాన్సర్ చేస్తూంటారు. తన అభిరుచితో సుధారెడ్డి ఫ్యాషన్ ప్రపంచంలో సరికొత్తగా ఆవిష్కృతమయ్యారు. సుధారెడ్డికి దేశవ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.




## సుచాత.. సూపరహే

### అందంలోనే కాదు.. గుణమూ అద్భుతం

**హైదరాబాద్, మహా:** ప్రపంచవ్యాప్తంగా వందకుపైగా దేశాల నుంచి వచ్చిన అందగత్తెలను అధిగమించిన థాయ్‌లాండ్ భామ ఓపల్ సుచాత చువాంగ్‌శ్రీ 72వ 'మిస్ వరల్డ్ 2025' కిరీటాన్ని కైవసం చేసుకున్నారు. ఇటీవలే మిస్ వరల్డ్ థాయ్‌లాండ్ 2025ను గెలిచుకున్న ఆమె తాజా పోటీల్లోనూ తన అందం, అభినయం, ప్రతిభతో ప్రపంచ కిరీటాన్ని సొంతం చేసుకున్నారు. ఈ క్రమంలో ఆమె నేపథ్యాన్ని పరిశీలిస్తే.. థాయ్‌లాండ్‌లోని ఫుకెట్ లో పుట్టి పెరిగారు సుచాతశ్రీ. బ్యాంకాక్‌లోని త్రియం ఉదోమ్ సుక్సా పాఠశాలలో చదువుకున్న ఆమె.. థాయ్, ఇంగ్లీష్‌తోపాటు చైనీస్ భాషలోనూ ప్రావీణ్యం సంపాదించారు. దీంతో వివిధ దేశాల సంస్కృతీ, సంప్రదాయాలపై మక్కువ పెంచుకున్నారు. ప్రస్తుతం థమ్మసాట్ విశ్వవిద్యాలయంలో పొలిటికల్ సైన్స్ అభ్యసిస్తూ.. అంతర్జాతీయ వ్యవహారాలపై దృష్టి సారించారు. వ్యాపారవేత్తల కుటుంబం నుంచి వచ్చిన ఆమెకు మోడలింగ్, అందాల పోటీల్లో పాల్గొనడమన్నా ఇష్టం. ఈ ఇష్టంతోనే 2021లో 'మిస్ రట్టనికొసన్' పోటీల ఆడిషన్స్‌లో పాల్గొన్నారు. అయినా ఆమెకు ఆ పోటీల్లో చోటు దక్కలేదు. అలాగని ఆమె అధైర్య పడలేదు. 2022లో తన 18వ ఏట 'మిస్ యూనివర్స్ థాయ్‌ల్యాండ్' పోటీల్లో పాల్గొని రెండో రన్నరప్‌గా నిలిచారు. దీంతో తనలో ఆత్మవిశ్వాసం రెట్టింపైంది. ఇక 2024లోనూ 'మిస్ యూనివర్స్ థాయ్‌ల్యాండ్' పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో విజయం సాధించడమే కాదు.. 'మిస్ ఛార్మింగ్ ట్యాలెంట్', 'మిస్ బ్యూటీ అండ్ కాన్ఫిడెన్స్'.. వంటి సబ్ టైటిళ్లూ గెలుచుకున్నారు.



# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

## జూన్ 6నాటికి ఇండ్ల నిర్మాణాలు ప్రారంభం కావాలి.. హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**హన్మకొండ మహా;** హనుమకొండ జిల్లాలో లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను మరింత వేగవంతంగా చేపట్టే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య ఆదేశించారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ఇందిరమ్మ ఇండ్లు, లబ్ధిదారుల ఎంపిక, పొజిషన్ సర్టిఫికెట్లు, రెవెన్యూ సదస్సులు, రాజీవ్ యువ వికాసం, టూబీహెచ్కె ఇళ్ళు, తదితర అంశాలపై సంబంధిత శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ యువ వికాసం పథకంపై ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, ఇందిరమ్మ ఇండ్లు పథకానికి సంబంధించి గృహ నిర్మాణ శాఖ డిఈ సిద్ధార్థ నాయక్, ఆయా మండలాలలో ఇందిరమ్మ ఇండ్ల పురోగతికి సంబంధించిన వివరాలను ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకంలో మొదటి దశలో రూ. 50 వేలు, రూ.లక్ష లోపు రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల



ఎంపికను జూన్ 9 నాటికి పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మండల స్థాయిలో పూర్తి చేసిన తర్వాత ఆ జాబితాను సబ్సిడీ రుణాల మంజూరు నిమిత్తం జిల్లా ఇన్చార్జి మంత్రి కి సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లు పథకానికి సంబంధించి పైలెట్ గ్రామాలలో ప్రారంభమైన ఇండ్ల నిర్మాణాల పనులను వేగంగా పూర్తయ్యేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. అర్హులైన లబ్ధిదారుల ఎంపికను అధికారులు పూర్తి చేయాలన్నారు. జూన్ రెండవ తేదీన రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి నియోజకవర్గానికి సంబంధించిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ప్రొసీడింగ్ పత్రాలు ఎమ్మెల్యేల చేతుల మీదుగా అందజేస్తారని, లబ్ధిదారులు వెంటనే ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జూన్ 6 నాటికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభం కావాలన్నారు. జూన్ 9 నాటికి 100% నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. ఎంపీడీవోలు ఇందిరమ్మ ఇండ్లు పథకానికి అదనంగా బఫర్ లిస్టు సిద్ధం చేయాలన్నారు. జూన్ 6 తేదీ నాటికి పైలట్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు నిర్మాణాలకు ముగ్గులు పోసి ప్రారంభించకపోతే తదుపరి చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవోలు పంచాయతీ కార్యదర్శులు ఏఈలు సమన్వయంతో లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా జిల్లాలో పైలట్ మండలంగా ఎంపికైన నడికుడ మండలంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని పరకాల ఆర్డీవో డాక్టర్ నారాయణ, నడికూడ తహసీల్దార్ రవీందర్ రెడ్డి ని ఆదేశించారు. దరఖాస్తుల విచారణ ప్రక్రియ ను ఆన్లైన్ లో నమోదు చేయాలన్నారు. జూన్ మూడో తేదీ నుండి ప్రారంభం కానున్న రెవెన్యూ సదస్సులలో వచ్చే దరఖాస్తుల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నియోజకవర్గాల్లోనూ నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా ఇన్చార్జి అదనపు కలెక్టర్లు వై వి గణేష్, మేన శ్రీను, పరకాల ఆర్డీవో డాక్టర్ కె.నారాయణ, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, కాజీపేట మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఇతర జిల్లా అధికారులతో పాటు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, ఏపీఎంలు పాల్గొన్నారు.

# డీఆర్ఎఫ్ బృందం అప్రమత్తంగా ఉండాలి

## నగర మేయర్ గుండు సుధారాణి

### నక్కల గుట్టలోని డి ఆర్ ఎఫ్ కార్యాలయం నర్సరీల పరిశీలన



**హన్మకొండ మహా;** వర్షాకాలం నేపథ్యం లో డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డి ఆర్ ఎఫ్) బృందం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. శనివారం హన్మకొండ లోని నక్కలగుట్ట సర్కిల్ కార్యాలయ ఆవరణలో గల డి ఆర్ ఎఫ్ కార్యాలయంతో పాటు నర్సరీ నీ మేయర్ క్షేత్ర స్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ కార్యాలయంలో ఉన్న బోట్ల ను పరిశీలించి వాటి పని తీరును స్థితి గతులను (కండిషన్) అడిగి తెలుసుకోవడం తో పాటు సిబ్బంది తో మాట్లాడి విధి నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. నర్సరీని సందర్శించిన మేయర్ ఇందులో పెంచబడుతున్న మొక్కల రకాలను సిబ్బందిని అడిగి తెలుసుకొని రాబోవు వనమహోత్సవాన్ని దృష్టి లో ఉంచుకొని ఎక్కువ మొత్తంలో మొక్కలను పెంచాలని మొక్కల పెంపకానికి అందజేతకు సంబంధించిన రికార్డులను సక్రమం గా నిర్వహించాలని మేయర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎస్ ఈ ,సి పి లు శ్రీనివాస్ రవీందర్ రాడేకర్, ఈ ఈ లు రవికుమార్, మాధవి లత, ఏసిపి రజిత, డి ఈ రాజ్ కుమార్, టి పి ఎస్ రోజా రెడ్డి, తదితరులు, పాల్గొన్నారు.



**వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవాలయం నూతన అధ్యక్షుడిగా దేవరం లింగారెడ్డి ప్రమాణ స్వీకార మహోత్సవం**

**బాలాపూర్ మహా:** గడ్డి అన్నవరం లో వెలసిన శ్రీ శ్రీ శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవాలయం నూతన అధ్యక్షుడిగా దేవరం లింగారెడ్డి ప్రమాణ స్వీకార మహోత్సవం శుక్రవారం సాయంత్రం ఆలయ సమావేశం మందిరంలో ఘనంగా జరిగింది. దేవాలయ పూర్వ(మాజీ) అధ్యక్షులు ఊర నరసింహగుప్త అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, గడ్డి అన్నారం కార్పొరేటర్ ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఊర నరసింహ గుప్తా మాట్లాడుతూ... గత మూడు సంవత్సరాలుగా ధర్మకర్తల సహాయ సహకారాలతో, దాతల సహకారంతో ఆలయాన్ని ఎంతో అభివృద్ధి చేశానని తెలిపారు. ఆలయంలో నిత్యం సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా మాసం ముగిసే వరకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నూతన చైర్మన్ దేవరం లింగారెడ్డి మాట్లాడుతూ తనకు ఈ అవకాశం ఇచ్చిన ధర్మకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని ఆయన అన్నారు. ఆలయంలో నూతన బోర్ వేయడానికి ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా హామీ ఇవ్వడం జరిగినట్టు తెలిపారు.

# ప్రభుత్వ ప్రణాళికలు అమలు చేయాల్సింది అధికారులే

## సరస్వతి పుష్కరం విజయవంతం ఉద్యోగులందరికీ అభివందనం

### రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు

**భూపాలపల్లి, మహా :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపడుతున్న పథకాలు ప్రమాదకబంధంగా క్షేత్రస్థాయిలో అమ్మలు చేయాల్సిన బాధ్యత అధికారుల పైనే ఉంటుందని తద్వారా అవి విజయవంతం అవుతాయని రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. ప్రభుత్వం ఏదైనా ఆలోచన మాత్రమే చేస్తుందని ఆచరణలో పెట్టాల్సింది అధికారులేనని, మీలాంటి అధికారులు సమగ్ర కార్యాచరణతో నిర్విరామంగా కృషి చేయడం వల్ల సరస్వతి పుష్కరాలు విజయవంతం అయ్యాయని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దిద్దుళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పుష్ప గ్రాండ్ లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధ్యక్షతన జరిగిన సరస్వతి పుష్కరాలు డే ఆఫ్ థాంక్స్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ పుష్కరాలు ఘనంగా నిర్వహించాలన్న ముఖ్యమంత్రి ఆలోచన మేరకు జిల్లా యంత్రాంగం 12 రోజులు 24 గంటలు నిర్విరామంగా కష్టపడ్డారని తెలిపారు. క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో పనిచేస్తేనే అది అమలు అవుతుందని నిరూపించారని, పుష్కరాలు వల్ల ప్రభుత్వానికి మంచి పేరు వచ్చినట్లు తెలిపారు. రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని సరస్వతి పుష్కరాల' నిర్వహణను ప్రభుత్వం ఒక సవాలుగా తీసుకుని నిర్బహించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ మార్గ నిర్దేశనంలో 33 శాఖలకు చెందిన అటెండర్ నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారి



వరకూ ప్రతి ఒక్కరూ మూడు నెలలు చాలా కష్టపడ్డారని, పుష్కరాలను విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ జిల్లా యంత్రంగా ఆశాంతం కష్టపడి పనిచేసి సరస్వతి పుష్కరాలను విజయవంతం చేసినట్లు తెలిపారు. సరస్వతి పుష్కరాలను బ్రహ్మాండంగా నిర్వహించిన యంత్రాంగం యొక్క కృషి చేసిన ప్రతి ఒక్కరిని అభినందించారు. ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేసి విజయానికి తోడ్పడ్డారని తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ యంత్రాంగమంతా ఒకతాటిపై నిలబడి అహర్నిశలు శ్రమించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారని తెలిపారు. సమగ్ర ప్రణాళికలతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారని తెలిపారు.

**ఎస్పి కిరణ్ ఖరే మాట్లాడుతూ**

సరస్వతి పుష్కరాలు 12 రోజులు నిర్విరామ కృషిచేసినట్లు తెలిపారు. అన్ని శాఖలు సమిష్టి కృషితో పుష్కరాలను విజయవంతం చేశాయని తెలిపారు. గత రెండు మూడు నెలల నుంచి మనం ఎన్నో అంచనాలను పెట్టుకుని చేయడం వల్ల పుష్కరాలు విజయవంతమైనట్లు తెలిపారు. ఎన్నో చాలెంజెస్ వచ్చాయని పుష్కరాలు విధులు ఎంతో సంతృప్తిని ఇచ్చాయని అన్నారు. ప్రతిరోజు ఒక ఛాలెంజ్ గా తీసుకొని ముందుకు వెళ్ళామన్నారు. పార్కింగ్ సమస్య వచ్చిందని వర్షాలు వల్ల ఇబ్బంది వచ్చినా ఎలాంటి ఇబ్బంది లేకుండా పునరుద్ధరణ పనులు చేసినట్లు తెలిపారు. అనంతరం పుష్కరాల విధులు నిర్వహించిన జిల్లా అధికారులను, సిబ్బందిని శాలువా, మెమెంటో తో అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, సింగరేణి జీఎం రాజేశ్వర్ రెడ్డి, ఆర్టీసీ వరంగల్ ఆర్ ఎం విజయభాను, ఆర్డిఓ రవి, ఎస్పి నరేష్ పాల్గొన్నారు.

# జిల్లాల్లో ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం




ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం సందర్భంగా వరంగల్ హనుమకొండ జిల్లాల న్యాయ సేవాధికార సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన పొగాకు నిరోధక అవగాహన కార్యక్రమాన్ని న్యాయ సేవా సదన్ భవనం లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి. నిర్మలా గీతాంబ హనుమకొండ జిల్లా ఇంచార్జ్ ప్రధాన న్యాయమూర్తి బి.అపర్ణాదేవి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రిబ్యునల్ కోర్ట్ న్యాయమూర్తి నారాయణ బాబు, వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శులు ఎం.సాయికుమార్, క్షమాదేశ్ పాండే, ఇతర న్యాయమూర్తులు, వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు వలుస శ్రీధర్, హనుమకొండ జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా.ఏ.అప్పయ్య, మెడికల్ ఆఫీసర్ డా మోహన్ సింగ్, డా శ్రీనివాస్, పల్మనాలజిస్ట్ డా.పూర్ణచంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ పొగాకు ఆరోగ్యాన్ని ప్రభావితం చేయడమే కాకుండా పర్యావరణాన్ని కూడా అనేక విధాలుగా చెడుగా ప్రభావితం చేస్తుందని పొగాకు వినియోగదారులలో అవగాహన కల్పించడం దానిని మానేయడానికి తగిన కారణాలను అందించేందుకు కృషి చేయాలన్నారు. పొగాకు కోరికను అధిగమించడానికి తన దృష్టి మరల్చుకుని పొగ రహిత ప్రాంతానికి వెళ్లడం, వ్యాయామం ఒత్తిడిని తగ్గించడానికి యోగా తో పాటు సంగీతం వంటి ప్రత్యామ్నాయ సడలింపు పద్ధతులను ప్రయత్నించాలని సూచించారు. అనంతరం హనుమకొండ ఇన్చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ పొగాకు వినియోగం వలన కలిగే చెడు ప్రభావాలను వివరించారు. పొగాకు వాడకం గుండె, ఊపిరితిత్తులను ప్రభావితం చేసే వ్యాధులకు దారితీస్తుందన్నారు. ధూమపానం గుండెపోటుకు ప్రధాన ప్రమాద కారకంగా ఉంటుందని, పొగాకు కు దూరంగా ఉండటం మంచిదని సూచించారు. ముఖ్యంగా యువత పొగాకు కు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. తదనంతరం ఈ సదస్సులో పాల్గొన్న ప్రతి ఒక్కరితో న్యాయమూర్తులు పొగాకు రహిత ప్రతిజ్ఞ చేపించడం జరిగింది.

## కాంగ్రెస్ పార్టీ కి పాకిస్తాన్ పై ఉన్న ప్రేమ మన త్రివిధ దళాల పై నమ్మకం లేకపోవడం బాధాకరమని రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్

**బాలపూర్ మహా:** ఉగ్రవాదుల పై భారత ప్రభుత్వం నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం సందర్భంగా మీర్ పేట్ ,బడంగ్ పేట్ కార్పొరేషన్ ల ఆధ్వర్యం లో బీజెపి నాయకులు విజయ తిరంగా యాత్ర ను బడంగ్ పేట్ నుండి బాలాపూర్ చౌరస్తా వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ ఎంపీ డాక్టర్ కే లక్ష్మణ్,చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి,రంగారెడ్డి జిల్లా రూలర్ అధ్యక్షుడు పతంగి రాజ్ గోపాల్ గౌడ్, మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జి అందెల శ్రీరాములు యాదవ్ పాల్గొన్నారు. భారతదేశ శక్తిని ప్రపంచ దేశాలకు త్రివిధ దళాల పాకిస్తాన్ ఉగ్రవాదుల పై విజయవంతంగా దాడి చేసి నిరూపించారని లక్ష్మణ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ద్వంద నీతిని అవలంబిస్తూ సీఎం రేవంత్ రెడ్డి పాకిస్తాన్ కి మద్దతు ఇచ్చే విధంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ కి పాకిస్తాన్ పై ఉన్న ప్రేమ మన త్రివిధ దళాల పై నమ్మకం లేకపోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు.



త్రివిధ దళాలకు మద్దతుగా విజయ తిరంగా యాత్ర లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారని బీజెపి పార్టీ రాజకీయంగా వాడుకోవడం లేదని స్పష్టం చేశారు. బాలాపూర్ లో ఉన్న రోహింగలను, అక్రమ వలసదారులను ఈ ప్రభుత్వం గుర్తించి తరిమేయాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. వారి వల్ల దేశ భద్రతకు ముప్పు వాటిల్లుతుందని ప్రభుత్వానికి తెలిపారు. ఈ కార్యక్రమం లో మీర్ పేట్ అధ్యక్షులు పసునూరి బిక్షపతి చారి,ముఖేష్ ముదిరాజ్,బడంగ్ పేట్ కార్పొరేషన్ అధ్యక్షులు రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి,రామిడి వీరకర్ణ రెడ్డి,మాజీ కార్పొరేటర్లు,బీజేపీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు ,ప్రజలు పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు

**జవహర్ లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్**

## రెన్యువల్ మిషన్ బాధితుల ఆందోళ

**బాలాపూర్ మహా:** నందనవనం లోనీ JNNURM ఇండ్ల లో అక్రమంగా ఉంటున్న కబ్జాదారులను ఇక్కడ నుండి తరలించాలని నిజమైన లబ్ధిదారులకు ఆ ఇండ్లలను ఇవ్వాలని బాధితులు రోడ్డు పై కూర్చొని ఆందోళన చేపట్టారు. జిహెచ్ఎంసి అధికారులు ఏమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారని లబ్ధిదారులు మండిపడ్డారు. వారం రోజుల లో కబ్జాదారులను ఇక్కడి నుండి తరలించకుంటే తామే ఇళ్లల్లోకి వెళ్తామని బాధితులు తెలిపారు. కబ్జా చేసిన వారికి మరో చోట ఇళ్ల పట్టాలు కేటాయించినప్పటికీ ఇక్కడి నుండి తరలి వెళ్లడం లేదని వారికి అధికారులు వత్తాసు పలుకుతూ నిజమైన లబ్ధిదారులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

## వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో శనివారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి సంయుక్తంగా పాల్గొని రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఖుషి మహల్ లో ఏర్పాటు చేయనున్న జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను అధికారికంగా నిర్వహించుటకు ఏర్పాట్లు జరుగుతున్నాయని, ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్చార్జ్ మంత్రివర్యులు పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి రానున్న సందర్భంగా పకడ్బందీ ఏర్పాటు చేయవలసిందిగా సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. వేదిక ఏర్పాట్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ శాఖల సంక్షేమ అభివృద్ధి స్టాల్స్ , శకటాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, అట్టి ఏర్పాట్లు రేపటి వరకు పూర్తి చేయవలసిందిగా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విజయలక్ష్మి , వరంగల్ ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, నర్సంపేట ఆర్డిఓ ఉమారాణి, జడ్పీ సీఈవో రామ్ రెడ్డి హౌసింగ్ పీడీ గణపతి డిఆర్డిఓ కౌసల్య దేవి , వరంగల్, ఖిలా వరంగల్ తాసిల్దార్లు సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## మా పార్టీ నుంచి వెళ్లిన నేతలను కలవలేదు

**: హరీశ్‌రావు**

**హైదరాబాద్, మహా :** పీసీసీ అధ్యక్ష హోదాలో ఉంటూ మహేశ్‌కుమార్‌గౌడ్ చిల్లర వ్యాఖ్యలు చేస్తున్నారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. భాజపా ఎంపీ ఈటల రాజేందర్‌తో భారాస నేతలు రహస్యంగా సమావేశమయ్యారంటూ మహేశ్‌కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఈమేరకు 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. నేరుగా ఎదుర్కొనే ధైర్యం లేక దిగజారుడు రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. "బట్ట కాల్చి మీద వేసినంత మాత్రాన అబద్ధాలు నిజం కావు. మా పార్టీ నుంచి వెళ్లిన నేతలను వ్యక్తిగతంగా ఎప్పుడూ కలవలేదు. పెళ్లిలోనో, చావులోనో కలిసిన సందర్భాలే తప్ప వ్యక్తిగతంగా కలవలేదు. మీరు విలువలు విస్మరించి రేవంత్‌రెడ్డి బాటలోనే నడుస్తున్నారు. ఇలాంటి ఆరోపణలు మానుకొని స్థాయికి తగ్గట్లు వ్యవహరించాలి. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, హామీల అమలుపై దృష్టిపెట్టాలి" అని హరీశ్‌రావు తెలిపారు.

# కాంగ్రెస్ పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు

## విమర్శకులు క్షేత్రస్థాయిలో అధికారులతో కలిసి పరిశీలించాలి.. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు

**భూపాలపల్లి, మహా :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి చేపట్టిన ప్రారంభిల పాలనలో పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అభివృద్ధి చేస్తున్నామని విమర్శలు చేసే వ్యక్తులు రాష్ట్ర లో అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అవగతమవుతుందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దు ద్దిల శ్రీధర్ బాబు అన్నారు. శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఫంక్షన్ హాల్ లో సరస్వతి పుష్కరాలు డే ఆఫ్ థాంక్స్ అభినందన సభకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పదేళ్లలో చేపట్టినటువంటి పథకాలు కాంగ్రెస్ మహిళల మహాలక్ష్మి పథకం, గృహ జ్యోతి, రెండు లక్షల పంట రుణమాఫీ, రైతు భరోసా,రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్ల పథకం, 57 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చామని శ్రీధర్ బాబు తెలిపారు. సరస్వతి పుష్కరాలు విజయవంతమవడంలో జిల్లాలోని 33 శాఖల అధికారుల కృషి తో విజయవంతమైనట్లు, విధులలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు శ్రీధర్ బాబు పేర్కొన్నారు. కాళేశ్వరం చిన్న గ్రామమైనప్పటికీ అధికారులు పుష్కరాలు సమయంలో ఎన్నో సమస్యలను అధిగమిస్తూ సవాళ్లను ఎదుర్కొంటూ పుష్కర భక్తులకు రాకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు మంత్రి కితాబు ఇచ్చారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా ఎస్పీ కిరణ్ ఖరేలను శాలువాతో సన్మానం చేసి మేమెంటో ఇచ్చారు. జిల్లా శాఖల వారీగా అధికారులందరిని మంత్రి శ్రీధర్ బాబు శాలువాతో సన్మానం చేసి మేమెంటో ఇచ్చారు. సరస్వతి పుష్కరాల్లో విజయవంతం కావడం కోసం పక్కా ప్రాణాధికతో మొదటి నుండి మార్గ నిర్దేశం చేస్తూ నిధులు కేటాయించడం సమీక్ష సమావేశాలు నిర్వహించి సూచనలు సలహాలు ఇచ్చిన రాష్ట్రమంత్రి శ్రీధర్ బాబు కు దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కృతజ్ఞతలు తెలిపారు.



**కుంభమేళ తరహాలో గోదావరి పుష్కరాలు**

కుంభమేళా తరహాలో రాష్ట్రంలో వచ్చే గోదావరి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి గోదావరి పుష్కరాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు గోదావరి నది పరివాహక ప్రాంతంలో గల ప్రముఖ దేవాలయాల్లో ముందస్తు ప్రాణాధికతో అభివృద్ధి చేసి గోదావరి పుష్కరాల ను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే, ట్రేడ్ కార్పోరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్ రెడ్డి జిల్లాలోని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భూపాలపల్లి జిల్లా అదనపు ఎస్పీగా ఏ. నరేష్ కుమార్

**భూపాలపల్లి, మహా :** భూపాలపల్లి అదనపు ఎస్పీగా ఏ. నరేష్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. పోలిసు శాఖలో 1991 సంవత్సరంలో ఎస్సైగా ఎంపికయిన అదనపు ఎస్పీ నరేష్ కుమార్, మొదట ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సుల్తానాబాద్,రాయకల్ , కోరుట్ల, వేములవాడ, కరీంనగర్ రూరల్ లో ఎస్సైగా విధులు నిర్వహించి, 2006 లో సీఐగా పదోన్నతి పొంది, సీఐడి వరంగల్, టేకులపల్లి, ఖమ్మం, కొత్తగూడెం, జగిత్యాల, ఖానాపూర్ సీఐ గా విధులు నిర్వర్తిస్తూ, 2017 లో డిఎస్పీ గా పదోన్నతి పొంది, మహబూబాబాద్, మామునూర్ ఏసిపి గా విధులు నిర్వర్తిస్తూ, 2023 లో అదనపు ఎస్పిగా ప్రమోషన్ పొంది, ఖమ్మం పోలీసు కమిషనరేట్ లో అదనపు డీసీపీ అడ్మిన్ గా విధులు నిర్వర్తిస్తూ, భూపాలపల్లి జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ గా బదిలీపై రావడం జరిగింది. అదనపు ఎస్పీ గా బాధ్యతలు స్వీకరించిన ఏ. నరేష్ కుమార్ జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీకి శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ , ప్రజల రక్షణ కోసం సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు.



# సీజనల్ వ్యాధుల నివారణకు పకడ్బందీ చర్యలు

## పారిశుద్ధ్యం, శుభ్రమైన తాగునీటి సరఫరాపై దృష్టి పెట్టాలి

### ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి.. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్,మహా:** వానాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యలపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో శనివారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో పారిశుధ్యం పై తగిన దృష్టి పెట్టాలని, నాలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని ఆదేశించారు. దోమల నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా పై దృష్టి పెట్టాలని, నీటి నమూనాలను ఎప్పటికప్పుడు పరీక్షించి క్లోరినేషన్ వంటి చర్యలు తీసుకోవాలని అన్నారు. తాగునీటి కలుషితం కారణంగానే ఎక్కువ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పరిశుభ్రమైన తాగునీరు సరఫరా చేయాలని అన్నారు. గత సంవత్సరం ఎక్కువ వ్యాధులు ప్రబలిన గ్రామాలు, వార్డులను గుర్తించి ఈ సీజన్లో జాగ్రత్త తీసుకోవాలన్నారు. ఎక్కడైనా డెంగీ కేసులు నమోదు అయితే ఆ ప్రాంతంలోని ప్రజలను అప్రమత్తం చేయాలని, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై శుక్రవారం సభ ద్వారా, స్వయం సహాయక సంఘాల సభ్యుల ద్వారా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు.

**"వనమహోత్సవం" విజయవంతం చేయాలి**

జిల్లాలో అనువైన అన్ని ప్రదేశాల్లో మొక్కలు నాటి మన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. వన మహోత్సవం నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వన మహోత్సవంలో భాగంగా జూన్ మొదటి వారం నుండి జిల్లాలో మొక్కల పెంపకానికి అనువైన స్థలాలను గుర్తించాలని అన్నారు. పాఠశాలలు, కళాశాలలు ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాలు, ఇతర అనువైన చోట్లలో విస్తృతంగా మొక్కలు నాటాలని అన్నారు. ఎంపీడీవోలు, తహసిల్దార్లు, అన్ని శాఖల అధికారులు నిర్దిష్ట లక్ష్యం ప్రకారం మొక్కలు నాటడంలో భాగస్వాములు కావాలని అన్నారు. మునగ, జామ, బొప్పాయి, నిమ్మ వంటి మొక్కల తో పాటు కానుగ మొక్కలు, వివిధ రకాల పండ్ల మొక్కలు నాటాలని సూచించారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులు పంట వ్యర్థాలను కాల్చివేస్తున్న సమయంలో ఏపుగా పెరిగిన చెట్లు కూడా ఆహుతి అవుతున్నాయని, దీని నివారణకు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. అవసరమైన మొక్కలను సరఫరాకు సిద్ధం చేయాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు.

**రాష్ట్ర అవతరణ వేడుకలకు ఏర్పాట్లు**

జూన్ 2న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో వేడుకలకు తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. ప్రోటోకాల్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలను వివరించే వివిధ శాఖల శకటాలు, స్టాళ్ల ప్రదర్శన చేయాలని ఆదేశించారు. వేడుకలకు వచ్చిన ప్రజలకు తాగునీటి సరఫరా చేయడంతో పాటు వైద్య బృందం అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్, డిఆర్ఓ వెంకటేశ్వర్లు, ఆర్డిఓ మహేశ్వర్, డీఎఫ్ఓ బాలమణి, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హత గల ప్రతి ఒక్కరికి అందాలి

## మంత్రి సీతక్క

- అందుకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలి
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి సమీక్షా సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరు
- భూభారతి, ఇందిరమ్మ ఇండ్లు, యాసంగి వరి ధాన్యం సేకరణ, ఖరీఫ్ సాగు సన్నద్ధం అంశాలపై సమీక్ష

**ఆదిలాబాద్ మహా:** ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హత గల ప్రతి ఒక్కరికి అందేలా అధికార యంత్రాంగం సమిష్టిగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళాశిశు సంక్షేమ శాఖ, జిల్లా ఇన్చార్జ్ మంత్రి దనసరి సీతక్క అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్షా సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భూభారతి, ఇందిరమ్మ ఇండ్లు, యాసంగి వరి ధాన్యం సేకరణ, ఖరీఫ్ సాగు సన్నద్ధం అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. యాసంగి వరి ధాన్యం సేకరణ కొరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వరి ధాన్యం సేకరిస్తున్నామని, ధాన్యం సేకరణ ప్రక్రియ చివరి దశకు చేరుతుందని తెలిపారు, తడిసిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన, చెందవలసిన అవసరం లేదని తెలిపారు. భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన భూభారతి నూతన ఆర్.ఓ.ఆర్, చట్టం2025లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో 4 జిల్లాలో 4 మండలాలను పైలెట్ మండలాలుగా ఎంపిక చేసి దరఖాస్తులు స్వీకరించి సంబంధిత సమస్యలను జూన్ 2వ తేదీలోగా పరిష్కరిస్తామని తెలిపారు. 2వ విడతలో జిల్లాకు ఒక మండలం చొప్పున ఎంపిక చేసి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. జూన్ 3వ తేదీ నుండి 20వ తేదీ వరకు అన్ని మండలాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యల పై దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, ధరణి స్థానంలో తీసుకువచ్చిన భూభారతి చట్టం రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు.

రైతులు తమ భూములను స్వేచ్ఛగా సాగు చేసుకునేలా ఎలాంటి వివాదాలు లేకుండా భూభారతి చట్టాన్ని రూపొందించామన్నారు. . నియోజకవర్గానికి 3 వేల 500 చొప్పున రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు కలిపి 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లు కేటాయించామని తెలిపారు. అత్యంత పేదవారికి జాబితాలో చోటు కల్పించడం జరుగుతుందని, సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పి.వి.టి.జి.లు, ఇతర ఆదివాసీలకు 5 వేల ఇందిరమ్మ ఇండ్లు ప్రత్యేకంగా కేటాయించడం జరిగిందని తెలిపారు. ఖరీఫ్2025 సాగుకు వ్యవసాయ శాఖ సన్నద్ధం కావాలని, నైరుతి రుతుపవనాలు వస్తున్నందున విత్తనాలు, ఎరువులు అవసరమైన మేరకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధిక ధరలకు విక్రయిస్తూ, కృత్రిమ కొరత సృష్టించే వారిపై, నకిలీ , నిషేధిత విత్తనాలు, ఎరువులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాలలో ప్రకృతి వైపరీత్య నియంత్రణ కమిటీలను ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలని, నీటిపారుదల, వైద్యఆరోగ్య, వ్యవసాయ శాఖలు, సంబంధిత శాఖలతో సమావేశాలు ఏర్పాటు చేసుకొని చేపట్టిన కార్యక్రమాలపై కార్యచరణ రూపొందించుకోవాలని తెలిపారు. జూన్ 12న విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న దృష్ట్యా పాఠశాలలు, వసతిగృహాలు సిద్ధం చేయాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి కౌమార దశ పిల్లలకు పౌష్టికాహారం కొరకు పల్లిచిక్కీలను ఇవ్వడం జరుగుతుందని, అంగన్వాడీ టీచర్లకు 2 లక్షల రూపాయల రిటైర్మెంట్ బెన్ఫిట్స్, వేసవి సెలవులు ఇవ్వడం జరుగుతుందన్నారు. జీతాల పెంపుదల అంశంపై ప్రభుత్వం ఆలోచిస్తుందని, 35 వేల 700 అంగన్వాడీ కేంద్రాలను ప్రిప్రైమరీ పాఠశాలలుగా మార్చడం జరిగిందని, 50 రకాల ఆట వస్తువులు అందించినట్లు వివరించారు. , టీచర్లు, సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించి దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉండేలా కృషి చేయాలని తెలిపారు. అంతకు ముందు మంచిర్యాల , ఆదిలాబాద్ ,ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల కలెక్టర్లు తమ జిల్లాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సమర్పించారు. అనంతరం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కిశోర బాలికల కొరకు ఇందిరమ్మ అమృతం పథకం క్రింద పల్లీలు, చిరుధాన్యాలతో తయారుచేసిన చిక్కీల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమం చివరన ఇటీవలే ప్రధాన మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్నఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షాను మంత్రి సీతక్క శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు దండే విఠల్,మల్క కొమురయ్య, మంచిర్యాల, బెల్లంపల్లి, ముధోల్ నియోజకవర్గాల శాసన సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, గడ్డం వినోద్, రామారావు పటేల్, జె.సి.సి. చైర్మన్ కొట్నాక తిరుపతి,మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల కలెక్టర్లు కుమార్ దీపక్, వెంకటేష్ దోత్రే, రాజర్షి షా, అభిలాష అభినవ్, సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, ఉమ్మడి జిల్లా అదనపు కలెక్టర్లు, రెవెన్యూ, వ్యవసాయ, గృహ నిర్మాణ శాఖ, పంచాయతీరాజ్ పౌరసరఫరాలు, వ్యవసాయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### శాంతి భద్రతల పరిరక్షణకై

# పోలీస్ కవాతు

## సతీష్ బాబు ఏసీపీ

**హన్మకొండ మహా;** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు శాంతి భద్రతల పరిరక్షణకై ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు నిర్వహిస్తున్నామని పరకాల ఏసీపీ సతీష్ బాబు తెలిపారు. ఈ మేరకు పరకాల డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో పరకాల మండల కేంద్రంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఏసీపీ ముఖ్య అతిథిగా పాల్గొన్ని జెండా ఊపి కవాతు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్. ఏ. ఎఫ్ డిప్యూటీ కామాండెంట్ సరస్వతి, ఇన్స్పెక్టర్ లు క్రాంతి కుమార్, సంతోష్, రంజిత్ తో పాటు ఎస్. ఐ లు ఇతర పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

### మండల బీజేపీ పార్టీ బలోపేతానికి

# తమ వంతు కృషి

## కందుకూరు మండల బిజెపి అధ్యక్షులు నిమ్మ అంజిరెడ్డి

## అన్నోజిగూడ గ్రామ బూత్ కమిటీ అధ్యక్షుడిగా కాకి గౌతమ్



**రంగారెడ్డి జిల్లా మహా:** బిజెపి పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం అని బిజెపి కందుకూరు మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి అన్నారు. శనివారం కందుకూరు మండలం అన్నోజిగూడ గ్రామంలో బీజేపీ బూత్ కమిటీ సమావేశం నిర్వహించి, పూర్తిస్థాయి కమిటీనీ ఏర్పాటు చేశారు. ఈ యొక్క కార్యక్రమానికి బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి, బీజేవైఎం రాష్ట్ర స్పోర్ట్స్ సెల్ కన్వీనర్ ఊటు మహేందర్, మండల ఉపాధ్యక్షుడు సురసాని భూమి రెడ్డి హాజరయ్యారు. అన్నోజిగూడ బూత్ కమిటీ అధ్యక్షుడిగా కాకి గౌతమ్ ముదిరాజ్, ప్రధాన కార్యాదర్శి అంకర్ల కృష్ణ, ఉపాధ్యక్షుడు మారమోని రాజేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గౌతమ్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో అధ్యక్షుడి బాధ్యతలు అప్పగించిన మండల కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి మాట్లాడుతూ... బూత్ కమిటీల నిర్మాణం ఉంటేనే పార్టీ పూర్తి స్థాయిలో బలోపేతమవుతుందన్నారు. దేశ అభివృద్ధి మన బాధ్యత అన్నారు. సమిష్టిగా పార్టీ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాబయ్య, రామ్ చందర్, ఢిల్లీ శ్రీనివాస్, పుచ్చల విష్ణు, కృష్ణ భాను, పుచ్చల విష్ణు, ఢిల్లీ శ్రీను, మారమోని బావయ్య, ఢిల్లీ భాను, ఢిల్లీ జగదీష్, ఢిల్లీ రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



### ప్రజా పాలనలో అర్హులందరికీ

# ఇందిరమ్మ ఇండ్లు

## ఆమనగల్లు మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి

**రంగారెడ్డి జిల్లా మహా:** అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారునికి ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని ఆమనగల్లు మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అందరికీ అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని తెలిపారు. ఆమనగల్లు మండలం మంగళపల్లి గ్రామంలో శనివారం ఇంద్రమ్మ లబ్ధిదారులకు ప్రొసీడింగ్లను అందించి. ఇంద్రమ్మ ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించారు రాష్ట్రంలో నిరుపేదల కోసం అందరికీ సొంతింటిని అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేసిందని తెలిపారు. లబ్ధిదారులు కట్టుకునే ఇంటికి ఐదు లక్షల ఆర్థిక సాయం నేరుగా వారి బ్యాంకు ఖాతాలో నాలుగు దశల్లో ప్రభుత్వం జమ చేస్తుందని తెలిపారు మొదటి విడుదల నివాసస్థల ఉన్న వారికి ఇల్లు నిర్మించి ఇవ్వడం జరుగుతుందని, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వితంతువులకు ప్రాధాన్యతిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకంలో ఎలాంటి అవినీతికి తావీ ఇవ్వకుండా రాజకీయ ప్రభావాలకు అధికారులు లొంగకుండా పారదర్శకంగా ఎంపిక విధానం రూపొందించినట్లు అనంత రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కొప్పు జంగయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య, గ్రామస్తులు మల్లయ్య, నరసింహ, అంజయ్య, బాలకష్టి తదితరులు పాల్గొన్నారు

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

## టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు




**రంగారెడ్డి జిల్లా మహా:** జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం టిడబ్ల్యూజేఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి సైదులు అన్నారు. శనివారము కడ్తాల్ పట్టణం మైసిగండి గ్రామంలో ఆమనగల్లు బ్లాక్ స్థాయి జర్నలిస్టుల నూతన కార్యవర్గాన్ని జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా నరసింహ, అధ్యక్షులుగా శంకర్, ప్రధాన కార్యదర్శిగా నరేష్, ఉపాధ్యక్షులుగా శేఖర్, హఫీజ్, లక్ష్మణ్, కోశాధికారిగా యాదగిరి సంయుక్త కార్యదర్శులుగా తిరుపతయ్య, తిరుపతయ్య గౌడ్, ప్రచార కార్యదర్శిలుగా రవి, గణేష్, సహాయ కార్యదర్శిగా శేఖర్, కార్యవర్గ సభ్యులుగా శ్రీను, అజీమ్ లను ఎన్నుకున్నారు. రాష్ట్ర కౌన్సిల్ గా ఆనంద్, జిల్లా కమిటీ సభ్యులుగా యూనుస్, వెంకటేష్, చంద్రశేఖర్ లను ప్రతిపాదిస్తున్నట్లు తీర్మానము చేశారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, ఆత్మగౌరవం కోసం కృషి చేస్తానని నూతన కమిటీ అధ్యక్షుడు శంకర్, ప్రధాన కార్యదర్శి నరేష్ అన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని జిల్లా సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో జాతీయ కమిటీ సభ్యులు దేవేందర్, జిల్లా నాయకులు సురేష్, శ్రీనివాస చారి, గణేష్, చంద్రశేఖర్, రఘుపతి పాల్గొన్నారు.

# మాజీ సర్పంచుల సేవలకు కేంద్ర ప్రభుత్వ ప్రశంస

## కడ్తాల్, అన్మాస్పల్లి, ఎక్వాయి పల్లి మాజీ సర్పంచులకు ప్రశంసా పత్రాలు

### పనితీరును గుర్తించిన అధికారులకు కృతజ్ఞతలు - లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి




**రంగారెడ్డి జిల్లా మహా:** దేశ వ్యాప్తంగా ఉన్న మారుమూల ప్రాంతాల్లోని ఆదివాసీ, గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం జన్ మన్ యోజన) పథకం ప్రవేశ పెట్టిందని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి అన్నారు. ఆదివాసీలకు మౌళికవసతుల ఏర్పాటులో భాగంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూపొందించిన ప్రణాళికలో భాగంగా 2019 2024 గ్రామపంచాయతీ పాలకవర్గ సమయంలో సర్పంచులు అందించిన సేవలకు గాను దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో పలువురు మాజీ సర్పంచులకు ప్రశంసా పత్రాలు అందించినట్లు తెలిపారు. శనివారం కడ్తాల్ మండల కేంద్రం విద్యుత్ అసిస్టెంట్ ఇంజినీరు కార్యాలయం ఆవరణలో కడ్తాల్,అన్మాస్పల్లి,ఎక్వాయి పల్లి సర్పంచులకు సూపరిండెంట్ ఇంజనీర్, రాజేంద్రనగర్ శ్రీరామ్ మోహన్ చేతుల మీదుగా ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం జన్ మన్ యోజన) పథకం ద్వారా అందించిన సేవలకు ప్రశంసా పత్రాలు అందించినట్లు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి తెలిపారు. ఈ పథకం ద్వారా విద్యుత్,సురక్షిత త్రాగునీరు,విద్య మరియు జీవనోపాధి పథకాలు ఆదివాసీలకు చేరువయ్యేలా కృషి చేసినందుకు గాను ప్రశంసా పత్రాలు అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రశంసాపత్రం అందించిన అధికారులకు, ప్రోత్సహించిన గ్రామ ప్రజలకు మరియు పాలకవర్గం సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేసారు. అన్మాస్పల్లి మాజి సర్పంచ్ శంకర్, ఏడిఈ ఆమనగల్ బాలకృష్ణ, ఏడిఈ మామిడిపల్లి శంకర్, ఏఈ కడ్తాల్ నరేందర్ పటేల్,మాజీ వార్డు సభ్యులు రామచంద్రయ్య,నాయకులుఅశోక్ ముదిరాజ్,కృష్ణయ్య,యాదయ్య గౌడ్,గండికోట శేఖర్, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



### ముద్విన్ బోడ్రాయి పండుగలో

# బీఆర్ఎస్ నాయకులు

**రంగారెడ్డి జిల్లా మహా:** కడ్తాల మండలం ముద్విన్ గ్రామపంచాయతీ పరిధిలోని కోర్లకొండ తండాలో బొడ్రాయి పండగకు బీఆర్ఎస్ శ్రేణులు రూ 45,000/ ఆర్థిక సాయం అందించారు. జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ట్రస్ట్ చైర్మన్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు, కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ 25,000 వేల రూపాయల ఆర్థిక సాయం అందించగా, కడ్తాల్ మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మైసిగండి మాజీ సర్పంచ్ తులసి రామ్ నాయక్, మాజీ ఉపసర్పంచ్ పాండులు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదయ్య, డైరెక్టర్ వెంకటయ్య, భాస్కర్ మహేందర్ సూర్య ప్రకాష్ మహేందర్ తండ పెద్దలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.


# ఈనెల 3 నుంచి 23 వరకు రెవెన్యూ సదస్సులు

## ఇబ్రహీంపట్నం ఆర్డిఓ అనంతరెడ్డి.. రెవెన్యూ సిబ్బందికి భూభారతి మాడ్యూల్స్ పై శిక్షణ



**రంగారెడ్డి జిల్లా మహా:** రెవెన్యూ సదస్సు గురించి శిక్షణా కార్యక్రమాన్ని ఆర్డీవో నిర్వహించారు. ఈనెల మూడు నుంచి 23 వరకు నిర్వహించే రెవెన్యూ సదస్సు శిక్షణ కార్యక్రమాల గురించి, శనివారం ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి సమక్షంలో, భూ భారతి మాడ్యూల్స్ దాని అనువర్తనాల గురించి, రైతులకు పూర్తి అవగాహన కల్పిస్తూ, అందులోని వివరాలను క్షుణ్ణంగా వివరించాలని ఆపరేటర్లకు, రెవెన్యూ సిబ్బందికి ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల, గ్రామాలలో ఈనెల 3 నుంచి 23 వరకు నిర్వహించడం జరుగుతుందని ఆర్డీవో తెలిపారు. రైతులు వారి యొక్క భూ వివరాలపై అవగాహన కల్పిస్తూ, సమస్యల పరిష్కారానికి కార్యక్రమం నిర్వహిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఎమ్మార్వోలు, రెవెన్యూ సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

# స్వర్ణకారులకు అవగాహన సదస్సు నిర్వహించిన ఇన్స్పెక్టర్



**వరంగల్ మహా;** వరంగల్ 28వ డివిజన్ పరిధిలోని విశ్వకర్మ వీధిలో గ్రేటర్ వరంగల్ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో వరంగల్ మట్టేవాడ సర్కిల్ ఇన్స్పెక్టర్ తుమ్మ గోపిరెడ్డి నేతృత్వంలో స్వర్ణకారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సి ఐ గోపి మాట్లాడుతూ భద్రతాపరమైన కీలకమైన అంశాలను తెలియజేస్తూ, చైన్ స్నాచింగ్, దొంగతనాలు, అంతర్ రాష్ట్ర దొంగల ముఠాలు, రోహింగ్యుల ముస్లింల పై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యంగా నగరంలో విచ్చలవిడిగా విక్రయాలు జరుగుతున్న దొంగ బంగారం పై భద్రత సూచనల చేస్తూ అత్యంత బాధ్యతయుతంగా వ్యవహరించాలని, గుర్తు తెలియని వ్యక్తులకు ఆశ్రమం ఇవ్వరాదని, వారితో ఎటువంటి లావాదేవీలు నిర్వహించకూడదని అవగాహన సదస్సును నిర్వహించారు. అలాగే బంగారం విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని, గుర్తు తెలియని వారితో బంగారం వ్యాపారం చేయరాదని స్వర్ణకారులకు సూచించారు. ప్రతి స్వర్ణకారుల దుకాణాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, సీసీ కెమెరాల ద్వారా నేరాలను అరికట్టవచ్చని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ స్వర్ణకార సంఘం ప్రధాన కార్యదర్శి కట్టా రాజేందర్, కందుకూరి చంద్రసేన, ఉప్పుల మోహన్, స్వర్ణకారులు పాల్గొన్నారు.

# క్షణంలో ట్రైన్ టికెట్ బుకింగ్

ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (IRCTC).. లేటెస్ట్ ఏఐ బేస్డ్ వర్చువల్ అసిస్టెంట్ 'ఆస్క్ దిశ 2.0' (AskDISHA 2.0) తీసుకొచ్చింది. ఇది ప్రయాణీకులకు అందించే సేవలను మరింత సులభారతం చేస్తుంది. ట్రైన్ టిక్కెట్లను బుక్ చేసుకోవడానికి మాత్రమే కాకుండా.. రీఫండ్ స్టేటస్‌లను తనిఖీ చేయడానికి కూడా ఉపయోగపడుతుంది. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారా 'ఆస్క్ దిశ 2.0' చాట్‌బాట్‌ను యాక్సెస్ చేయొచ్చు. వాయిస్ కమాండ్స్ సాయంతో కూడా మీకు కావాల్సిన సమాచారం పొందవచ్చు. ఇంగ్లీష్, హిందీ, గుజరాతీతో సహా వివిధ భాషలలో వాయిస్ కమాండ్‌లను ఉపయోగించి టిక్కెట్లను బుక్ చేసుకోవడానికి ఈ కొత్త విధానం అనుమతిస్తుంది. అయితే దీనికోసం మీరు ప్రత్యేకంగా ఐఆర్‌సీటీసీ పాస్‌వర్డ్ అవసరం లేదు.. ఓటీపీ ద్వారా బుకింగ్స్ పూర్తి చేయొచ్చు. టికెట్ క్యాన్సిల్ లేదా ఫెయిల్ ట్రాన్సాక్షన్స్ జరిగినటప్పుడు రిఫండ్ కూడా చాలా వేగంగా జరగడానికి ఈ 'ఆస్క్ దిశ 2.0' ఉపయోగపడుతుంది. అంతే కాకుండా ఇందులో ప్రయాణికుల వివరాలను సేవ్ చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో బుకింగ్ చేసుకోవడం వేగవంతం అవుతుంది.

### ఆస్క్ దిశ 2.0తో టికెట్ బుకింగ్

- IRCTC వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్ ఓపెన్ చేయగానే కింద కుడివైపు.. ఆస్క్ దిశ 2.0 చాట్‌బాట్ కనిపిస్తుంది.
- ఇక్కడ హలో లేదా టికెట్ బుక్ టైప్ చేయడం ద్వారా లేదా వాయిస్ కమాండ్‌లను ఉపయోగించి చాట్ ప్రారభించవచ్చు.
- మీ స్టేషన్, గమ్యస్థానం, ప్రయాణ తేదీ, తరగతి (స్లీపర్, 3ఏసీ, 2ఏసీ) ఎంటర్ చేయమని మిమ్మల్ని అడుగుతుంది.
- ఆస్క్ దిశ.. అందుబాటులో ఉన్న ట్రైన్స్ జాబితా, వాటి టైమింగ్స్, సీట్లు మొదలైన వాటిని చూపిస్తుంది. ఇందులో మీకు కావాల్సిన ట్రైన్, క్లాస్, సీటు మొదలైనవాటిని ఎంచుకోండి.
- చాట్‌బాట్ మీ వివరాలను ధ్రువీకరిస్తుంది. అవసరమైతే.. ఓటీపీ ధ్రువీకరనతో చెల్లింపులు పూర్తి చేయాల్సి ఉంటుంది.



## విద్యార్థులకు రూ.కోటి ఉపకార వేతనాలు : రిలయన్స్





**ముంబై:** రిలయన్స్ డిజిటల్ ఇండియా 'బూట్ అప్ ఇండియా' పేరుతో అతిపెద్ద ల్యాప్‌టాప్ సేల్స్ ప్రకటించింది. వ్యాపారపరంగా మాత్రమే కాకుండా 'నేటి విద్యార్థులను రేపటి అవకాశాలకు సన్నద్ధం చేయడం' అనే గొప్ప సంకల్పంతో క్యాంపెన్ నిర్వహించనుంది. సేల్స్‌లో భాగంగా ల్యాప్‌ట్యాప్‌లు, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్స్ ఉపకరణాలు తక్కువ ధరకే లభిస్తాయి. దేశవ్యాప్తంగా విద్యార్థులకు ఒక కోటి రూపాయల ఉపకార వేతనాలు ఇవ్వనుంది. అలాగే 25 కార్లు, 40 బైకులు, 450 పైగా ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులు గెలుచుకునే అవకాశం కల్పిస్తుంది.

## ఒకే స్టేటస్ ఇమేజ్‌లో ఆరు ఫొటోలు.. వాట్సాప్ కొత్త అప్‌డేట్




మెటా కంపెనీ ఆధ్వర్యంలోని ప్రముఖ ఇన్‌స్టంట్ మెసేజింగ్ యాప్ వాట్సాప్ తన వినియోగదారులకు కొత్త అప్‌డేట్ అందుబాటులోకి తీసుకొచ్చింది. వ్యక్తిగత సమాచారంతోపాటు వేడుకలు, ఇతర జ్ఞాపకాలను ముఖ్యమైన వారితో పంచుకోవడానికి వాట్సాప్ స్టేటస్‌ను గతంలోనే తీసుకొచ్చింది. అయితే అందులో ఇప్పటివరకు కేవలం ఒకే ఇమేజ్‌ను అప్‌లోడ్ చేసే వీలుండేది. తాజాగా వాట్సాస్ తీసుకొచ్చిన అప్‌డేట్‌తో స్టేటస్ ఇమేజ్‌లో గరిష్ఠంగా ఆరు ఇమేజ్‌లను అప్‌లోడ్ చేసేలా వెసులుబాటు కల్పించింది. ఈమేరకు మే 30న కొత్త అప్‌డేట్ అందించింది. స్టేటస్ ద్వారా యూజర్లు మరింత సృజనాత్మకంగా తమ ఇమేజ్‌లను ఇతరులతో పంచుకునేందుకు అవకాశం కల్పించింది. కొత్తగా లేఅవుట్లు, మ్యూజిక్, ఫొటో స్టిక్కర్లు.. వంటి ఫీచర్లతో 'యాడ్ యువర్స్' ఆప్షన్ ద్వారా ఇమేజ్‌లను యాడ్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తుంది. వినియోగదారులు సులభంగా ఉపయోగించేలా ఎడిటింగ్ టూల్స్‌తో గరిష్టంగా ఆరు ఫొటోలను ఒకే ఇమేజ్ స్టేటస్‌లో పొందుపరిచేలా లేఅవుట్‌ను రూపొందించారు. యూజర్లు ఇమేజ్‌లన్నింటినీ ఒకే ఫ్రేమ్‌లో ఎలా చూపించాలనుకుంటున్నారో సరిగ్గా అమర్చుకుంటే సరిపోతుంది. దీనికి అదనంగా మ్యూజిక్‌ను యాడ్ చేసుకోవచ్చు. వినియోగదారుల మానసిక స్థితిని అనుసరించి ట్యూన్ సెట్ చేయవచ్చు. దాంతోపాటు మ్యూజిక్ స్టిక్కర్‌ను ఉపయోగించవచ్చు. ఈ కొత్త ఫీచర్‌ను ఉపయోగించాలంటే వాట్సాప్‌ను అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుందని గుర్తుంచుకోవాలి.

## బట్టలుతికే సర్ఫ్ కంపెనీ టర్నోవర్ ఎంతంటే..



హిందుస్థాన్ యూనిలీవర్ ఆధ్వర్యంలోని లాండ్రీ డిటర్జెంట్ బ్రాండ్ సర్ఫ్ ఎక్సెల్ 2025 ఆర్థిక సంవత్సరంలో రూ.10,000 కోట్ల టర్నోవర్ మార్కును అధిగమించినట్లు తెలిపింది. వినియోగదారుల్లో ఈ బ్రాండ్‌కు ఉన్న ఆదరణే ఈ మార్కు చేరేందుకు తోడ్పడిందని కంపెనీ సీఈఓ, ఎండీ రోహిత్ జవా తెలిపారు. 2022 ఆర్థిక సంవత్సరంలో రూ.8,200 కోట్ల అమ్మకాలను నమోదు చేసిన సర్ఫ్ ఎక్సెల్ హెచ్‌యూఎల్ అతిపెద్ద బ్రాండ్‌ల్లో ఒకటిగా తన స్థానాన్ని నిలబెట్టుకుందని జవా చెప్పారు. 2025 నాటికి ఇది రూ.10,000 కోట్లు మార్కును చేరినట్లు తెలిపారు. హెచ్‌యూఎల్ వార్షిక నివేదికలో భాగంగా ఈ మేరకు వివరాలు వెల్లడించారు. హెచ్‌యూఎల్ హోమ్ కేర్ విభాగం రూ.22,972 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసిందని చెప్పారు. కంపెనీ మొత్తం టర్నోవర్ రూ.60,000 కోట్లు దాటిందని పేర్కొన్నారు. అండర్‌లైయింగ్ వాల్యూమ్ వృద్ధి(ధరల్లో ఒడిదొడుకులున్నా అమ్మకాలు పెరగడం)లో 2% పెరుగుదలను, ప్రతి షేరుకు 5% ఆదాయం వృద్ధి నమోదు చేసినట్లు చెప్పారు.

## 6000 మంది ఉద్యోగుల తొలగింపు అందుకే: సత్య నాదెళ్ళ

మైక్రోసాఫ్ట్ ఇటీవల దాదాపు 6,000 మంది ఉద్యోగులను, అంటే దాని ప్రపంచ శ్రామిక శక్తిలో దాదాపు 3 శాతం మందిని తొలగించింది.. అసలు కంపెనీ ఇంతమందిని ఎందుకు తొలగించింది అనే విషయాన్ని సీఈఓ సత్యనాదెళ్ళ వివరించారు. ఇటీవల ఉద్యోగులతో జరిగిన టౌన్ హాల్ సమావేశంలో సత్యనాదెళ్ళ మాట్లాడుతూ.. ఉద్యోగులను తొలగించడానికి ప్రధాన కారణం పనితీరు సరిగ్గా లేకపోవడం కాదు. సంస్థ పునర్వ్యవస్తీకరణలో భాగంగానే ఉద్యోగుల తొలగింపులు చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

పోటీ ప్రపంచంలో మైక్రోసాఫ్ట్ కంపెనీ తన కోపైలెట్ ఏఐ అసిస్టెంట్‌లను మరింత వేగంగా వినియోగదారులకు చేర్చడం మీద కూడా దృష్టి సారించింది. దీనికోసం కొన్ని సంస్థలతో.. ఒప్పందాలను కూడా కుదుర్చుకుంది. ఏఐ టూల్స్ వాడకం మాత్రమే కాకుండా.. ఇందులో ఉద్యోగులకు సైతం శిక్షణ ఇవ్వాల్సిన ఉందని సత్యనాదెళ్ళ వివరించారు. మైక్రోసాఫ్ట్ ఈ సంవత్సరం ఏఐ మౌలిక సదుపాయాలలో 80 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టాలని యోచిస్తోంది. ఇందులో ఏఐ సామర్థ్యాలను విస్తరించడం మాత్రమే కాకుండా.. వివిధ ప్లాట్‌ఫామ్‌లు, సేవలలో దాని కోపైలట్ ఏఐ అసిస్టెంట్‌లను ప్రవేశపెట్టడం వంటివి ఉన్నాయి.

మైక్రోసాఫ్ట్ చీఫ్ ప్రొడక్ట్ ఆఫీసర్ 'అపర్ణ చెన్నప్రగడ' కూడా ఇదే కార్యక్రమంలో పాల్గొన్నారు. కోడింగ్ లేదా కంప్యూటర్ సైన్స్ అధ్యయనం వాడుకలో లేకుండా పోతుందనే ఆలోచనలను గురించి మాట్లాడుతూ.. "కంప్యూటర్ సైన్స్ చదవకూడదనే లేదా కోడింగ్ చనిపోయిందనే భావన ఏ మాత్రం సరైంది కాదు, ఇందులో ఉద్యోగాలకు ఎటువంటి డోకా లేదని.. భవిష్యత్తు కూడా బాగుంటుందని ఆమె భరోసా ఇచ్చారు.






# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# అణు విపత్తును ఆపేశా: ట్రంప్ నోట అదే పాట

**వాషింగ్టన్:** భారత్ పాక్ పోరుపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోమారు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భారతదేశంపాకిస్తాన్‌లు పరస్పరం యుద్ధం కొనసాగించకుండా నియంత్రించానని, అణు విపత్తుకు దారి తీయగలిగే పోరును ఆపానని ట్రంప్ పేర్కొన్నారు. తాము పరస్పరం కాల్పులు జరుపుకునే దేశాలతో వాణిజ్యం కొనసాగించలేమని గతంలో ఇరు దేశాలకు స్పష్టం చేశానని ట్రంప్ తెలిపారు. భారత్ పాకిస్తాన్ మధ్య జరిగిన యుద్ధం అణు విపత్తుగా మారే అవకాశం ఉందని భావించానని అధ్యక్షుడు ట్రంప్ ఓవల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. ఇరు దేశాలు యుద్ధాన్ని ముగించినందుకు ఆ దేశాధినేతలు, ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. ఇరు దేశాలతో తాము సాగిస్తున్న వాణిజ్య వ్యవహారాలపై మాట్లాడుకున్నామని, పరస్పరం కాల్పులు జరుపుకుంటూ, అణ్వాయుధాలు ఉపయోగించే సత్తా కలిగిన వారితో వ్యాపారం చేయలేమని తేల్చి చెప్పామని ట్రంప్ పేర్కొన్నారు. భారత్, పాక్‌లకు చెందిన నేతలు తమను అర్థం చేసుకున్నారని, తమ వినతిని అంగీకరించి, యుద్ధాన్ని ముగించారని ట్రంప్ అన్నారు. కాగా జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రవాద దాడిలో 26 మంది పౌరులు మృతి చెందారు. ఆ తరువాత భారత్ 'ఆపరేషన్ సింధూర్' చేపట్టింది. నాలుగు రోజుల పాటు సాగిన డ్రోన్, క్షిపణి దాడుల తర్వాత మే 10న భారత్ పాకిస్తాన్ మధ్య యుద్ధం ముగింపుపై ఒక ఒప్పందం కుదిరింది. ఈ విషయంలో మూడవ పక్షం ప్రమేయం లేదని భారత ప్రభుత్వం వర్గాలు స్పష్టం చేశాయి. కాగా భారత్‌పాక్ మధ్య ఉద్రిక్తతలను పరిష్కరించడానికి తాను సహాయం చేయగలనని ట్రంప్ ప్రకటించారు.



## శశిథరూర్ దౌత్య విజయం
### వైఖరి మార్చుకున్న కొలంబియా



**న్యూఢిల్లీ:** భారత్ మే 7న 'ఆపరేషన్ సిందూర్'ను చేపట్టిన సమయంలో పాకిస్తాన్‌లో చోటుచేసుకున్న మరణాలపై దక్షిణ అమెరికాలోని కొలంబియా సంతాపం ప్రకటించింది. అయితే దీనిపై ఎంపీ శశిథరూర్ కొలంబియాకు అవగాహన కల్పించడంతో, తాను గతంలో చేసిన ప్రకటనను ఆ దేశం ఉపసంహరించుకుంది. అలాగే ఉగ్రవాదంపై పోరు సాగిస్తున్న భారత్‌కు మద్దతిస్తున్నట్లు స్పష్టం చేసింది. కొలంబియా పర్యటనలో ఉన్న అఖిలపక్ష ప్రతినిధి బృందానికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ మీడియాతో మాట్లాడుతూ కొలంబియాఇటీవల పాక్ మరణాలపై చేసిన ప్రకటనను ఉపసంహరించుకున్నదని, త్వరలోనే భారత్ వైఖరికి మద్దతు పలుకుతూ, మరో ప్రకటన చేయనున్నదని తెలిపారు. ఈ సందర్భంగా యునైటెడ్ స్టేట్స్‌లోని మాజీ భారత రాయబారి, బీజేపీ నేత తరంజిత్ సింగ్ సంధు మాట్లాడుతూ తమ ప్రతినిధి బృందం భారత్‌పాక్ యుద్ధంపై సరైన వివరణ ఇవ్వడంతో, అది కొలంబియా వైఖరిలో మార్పు వచ్చేందుకు సహాయపడిందని అన్నారు. దీనిపై కొలంబియా ఉప విదేశాంగ మంత్రి రోసా యోలాండా విల్లా విసెన్సియో మాట్లాడుతూ తమకు భారత్ పాక్‌ల మధ్యనున్న వాస్తవ పరిస్థితులు తెలిశాయని, కశ్మీర్‌లో ఏమి జరిగిందనే దానిపై అవగాహన ఏర్పడిందన్నారు. ఇకపై తాము స్పష్టమైన ప్రకటన చేయగలమన్నారు. కాగా 'ఆపరేషన్ సింధూర్' సమయంలో పాక్‌లో చోటుచేసుకున్న మరణాలపై కొలంబియా సంతాపం ప్రకటించడాన్ని ఎంపీ శశిథరూర్ ఖండించారు.

## దేశంలో కోవిడ్ కలకలం
### 3,395కు చేరిన యాక్టివ్ కేసులు



**ఢిల్లీ:** దేశంలో మళ్లీ కోవిడ్ కలకలం సృష్టిస్తోంది. క్రమంగా కేసుల సంఖ్య పెరుగుతోంది. 3,395కు యాక్టివ్ కేసులు చేరాయి. గత 24 గంటల్లో కోవిడ్‌తో నలుగురు మృతి చెందారు. యూపీ, ఢిల్లీ, కర్ణాటక కేరళలో ఒక్కొక్కరు మృతి చెందారు. కోవిడ్ నుంచి కోలుకుని 1435 మంది ఆసుపత్రుల నుంచి డిశ్చార్జ్ అయ్యారు. 8 రాష్ట్రాలలో కోవిడ్ కేసుల సంఖ్య పెరుగుతోంది. ఢిల్లీలో 375, గుజరాత్‌లో 265, కర్ణాటకలో 254, కేరళలో 1336, మహారాష్ట్రలో 467, తమిళనాడులో 185, వెస్ట్ బెంగాల్‌లో 205, ఉత్తరప్రదేశ్‌లో 117 కోవిడ్ కేసులు నమోదయ్యాయి. రద్దీ ప్రదేశాల్లో తిరిగేటప్పుడు మాస్కులు ధరించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో కరోనా కలకలం రేపింది. పాల్వంచ కేటీపీఎస్ కర్మాగారంలో విధులు నిర్వహించే వెంకట్ అనే వ్యక్తి కరోనా వచ్చినట్లు కేటీపీఎస్ హాస్పిటల్ వైద్యులు నిర్థారించారు. కాగా, ఏపీలో కోవిడ్ కేసులు పెరుగుతున్నా కానీ.. ప్రజలను అప్రమత్తం చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనే విమర్శలు వస్తున్నాయి. ఏలూరు జిల్లాలో కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. కలెక్టరేట్‌లోని ముగ్గురు ఉద్యోగులకు వైరస్ సోకింది. జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతున్న ముగ్గురికి కోవిడ్ పరీక్షలు నిర్వహించగా పాజిటిట్‌గా నిర్ధారణ అయినట్లు సమాచారం. అయితే.. ఈ విషయాన్ని గోప్యంగా ఉంచిన అధికారులు.. వైద్యుల సూచన మేరకు ఆ ముగ్గురు ఉద్యోగుల్ని ఐసోలేషన్‌కి పంపించారు. వాట్సాప్ గ్రూపుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న స్థానికులు ఆందోళనకు గురయ్యారు. తమను అప్రమత్తం చేయకుండా అధికారులు ఇలా వ్యవహరించడం ఏంటని మండిపడుతున్నారు. ఏపీలో విశాఖపట్నం, కోనసీమ, పశ్చిమగోదావరి, గుంటూరు.. ఇలా కేసులు వెలుగు చూశాయి. కడపలో కరోనా కేసు వెలుగు చూస్తే.. దానిని అధికారులు దాచిపెట్టే ప్రయత్నం చేయడం తెలిసిందే.

## వీడ్కోలు వేళ ఎలాన్ మస్క్ ముఖంపై గాయం.. ఏం జరిగింది?





**వాషింగ్టన్:** బిలియనీర్ ఎలాన్ మస్క్ వీడ్కోల వేళ ఆసక్తికర ఘటన వెలుగులోకి వచ్చింది. మస్క్ నుదుటి, కంటి వద్ద ఉన్న గాయంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా మస్క్ ఇచ్చిన సమాధానానికి అందరూ ఒక్కసారిగా నవ్వుకున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైతం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్ష సలహాదారుగా వైదొలుగుతున్నట్లు ప్రకటించిన ఎలాన్ మస్క్‌కు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వీడ్కోలు పలికారు. 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ' (DOGE) సారథిగా ఎలాన్ మస్క్ సేవలు అందించారు. మే 30న తన పదవికి చివరి రోజు కావడంతో అధ్యక్షుడు ట్రంప్ కార్యాలయానికి ఎలాన్ మస్క్ వెళ్లారు. ఈ సందర్భంగా ఘనంగా వీడ్కోలు పలికారు. అయితే, ఈ కార్యక్రమంలో మస్క్ ముఖంపై ఉన్న గాయం చర్చకు వచ్చింది. దీనిపై అక్కడున్న వారు మస్క్‌ను ప్రశ్నించారు. ఎలాన్ మస్క్ స్పందిస్తూ.. ఈ గాయం నా కుమారుడు చేసింది. నేను, నా ఐదేళ్ల కుమారుడు X AXii బీచ్‌లో గుర్రపు స్వారీ చేస్తున్నాం. ఈ క్రమంలో అతడు నా ముఖంపై ఒక పంచ్ ఇచ్చాడు. దీంతో, అక్కడ గాయం ఏర్పడింది. ఆ సమయంలో దీన్ని నేను పెద్దగా పట్టించుకోకపోవడంతో ఇలా మారిపోయింది' అని చెప్పుకొచ్చారు. ఐదేళ్ల కుమారుడు కొడితే ఇంతలా గాయమైందా? అని అక్కడున్న వారంతా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ట్రంప్ సైతం స్పందిస్తూ.. ఇన్ని రోజులు తాను కూడా గాయాన్ని చూడలేదని చెప్పుకొచ్చారు. కానీ, మస్క్ కుమారుడు అలా చేయగలడు అని అన్నారు. ఇక, ట్రంప్, టెక్ మాగ్నెట్ కుమారుడే X AXii. అయితే, ఎలాన్ మస్క్ కొన్ని రకాల డ్రగ్స్ వినియోగిస్తున్నారంటూ ఓ అంతర్జాతీయ మీడియాలో కథనం వెల్లడించింది. ఈ నేపథ్యంలో వైట్‌హౌస్‌లో ఉన్నప్పుడు కూడా వాటిని వినియోగించారా? అని మస్క్‌ను విలేకరి ప్రశ్నించారు. ఈ సందర్భంగా మాస్క్ స్పందిస్తూ.. అది తప్పుడు కథనం అంటూ సమాధానం ఇచ్చారు. అయినప్పటికీ, మస్క్ ముఖంపై గాయం పలు అనుమానాలకు తావిస్తోంది. ఏం జరిగిందనే చర్చ నడుస్తోంది.

ఇదిలా ఉండగా.. వీడ్కోలు సందర్భంగా ట్రంప్.. మస్క్‌కు బంగారు రంగుతో కూడిన తాళం చెవిని అందించారు. ప్రత్యేకమైన వ్యక్తులకే ఈ బహుమతి అందిస్తానని ట్రంప్ తెలిపారు. ఇది దేశం తరఫున అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్ మీట్‌లో మస్క్ సేవలను ట్రంప్ అభినందించారు. తనకు అప్పగించిన బాధ్యతలను మస్క్ అవిశ్రాంతంగా నిర్వహించారన్నారు. ప్రపంచంలోనే మస్క్ ఒక గొప్ప వ్యాపారవేత్త, ఆవిష్కర్త అని కొనియాడారు. తన ప్రతిభను దేశ అభివృద్ధికి వినియోగించేందుకు ముందుకు వచ్చినట్లు పేర్కొన్నారు.

**స్నేహితుడిగా, సలహాదారుగా ఉంటా..**

డోజ్‌కు వీడ్కోలు సందర్భంగా ఎలాన్ మస్క్ మాట్లాడారు. ఇక నుంచి తరచుగా అధ్యక్ష కార్యాలయాన్ని సందర్శిస్తానని మస్క్ తెలిపారు. అధ్యక్షుడు ట్రంప్ కోరితే అవసరమైన సమయంలో తన సహాయం అందిస్తానన్నారు. ఇక మీదట సైతం ట్రంప్‌నకు స్నేహితుడిగా, సలహాదారుగా ఉంటానని పేర్కొన్నారు. 'డోజ్' పదవి కాలం పరిమితితో కూడుకున్నదని మస్క్ తెలిపారు. ఇప్పటినుంచి తన వ్యాపారాలపై మరింత దృష్టి సారిస్తానన్నారు. 'డోజ్'కు ఇది ముగింపు కాదని, ప్రాజెక్ట్ ఇప్పుడే ప్రారంభమైందన్నారు. ట్రిలియన్ డాలర్ల వృథాను ఇది అరికడుతుందన్నారు.



## పురుషులు సక్సెస్ అయితే అలా.. అదే మహిళలు సాధిస్తే..

### మానుషి చిల్లర్ ఆవేదన!

మాజీ మిస్ వరల్డ్ మానుషి చిల్లర్ ఆసక్తికర కామెంట్స్ చేసింది. మనదేశంలో మిస్ వరల్డ్ పోటీలు జరుతుగున్న వేళ.. ఏ రంగంలోనైనా మహిళలను చిన్నచూపు చూస్తున్నారని విమర్శించింది. ముఖ్యంగా సినీ ఇండస్ట్రీలో మహిళలకు ఎలాంటి గౌరవం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలను కేవలం గ్లామర్ వస్తువుగానే చూస్తున్నారని మానుషి చిల్లర్ అభిప్రాయపడింది. తాజాగా ట్విటర్ వేదికగా ఆమె చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. మానుషి తన ట్వీట్‌లో రాస్తూ.. 'స్త్రీల పట్ల ద్వేషపూరిత మనస్తత్వం ఉన్నవారు.. స్త్రీ సాధించిన విజయం కంటే ఆమె వెనుక పురుషుడి ఉన్నాడని ఆపాదించడం సులభంగా భావిస్తారు. వాస్తవ ప్రపంచంలో ఎటువంటి ప్రభావం చూపని ఇలాంటి తెలివితక్కువ వ్యాఖ్యలను పట్టించుకోవడం నేను ఎప్పుడో మానేశా. కానీ ముఖ్యంగా సినీ పరిశ్రమలో పనిచేసే మహిళలను అగౌరవంగా చూడడం.. నేను నిరంతరం గమనిస్తూనే ఉన్నా. లింగ భేదం లేకుండా మనమందరం సమాన విలువ, సాధికారత, విద్యావంతులైన వాతావరణంలో పెరిగాం. కానీ పురుషులు విజయం సాధిస్తే కష్టపడి పనిచేసేవారు, ప్రతిభావంతులని పొగుడుతారు. అదే మహిళలు సాధిస్తే అవకాశవాదులని ముద్రవేస్తారు. ఇలాంటి అనుభవాన్ని నేను కూడా ఎదుర్కొన్నా. ఒక స్త్రీ గురించి ఎలాంటి సంబంధం లేని వ్యక్తులు చెడుగా మాట్లాడడం అంత సులభమా? లేదా ఏళ్లుగా పాతుకుపోయిన పక్షపాతమా' అని ప్రశ్నించింది. ముఖ్యంగా మహిళల విజయాన్ని పురుషులకు అపాదించడాన్ని మానుషి చిల్లర్ విమర్శిస్తోంది. ఇక సినిమాల విషయానికొస్తే మానుషి చిల్లర్.. అక్షయ్ కుమార్ నటించిన పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'సామ్రాట్ పృథ్వీరాజ్'తో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. విక్కీ కౌశల్ సరసన 'ది గ్రేట్ ఇండియన్ ఫ్యామిలీ'లో నటించింది. టాలీవుడ్‌లో వరుణ్ తేజ్ సరసన 'ఆపరేషన్ వాలెంటైన్'లో ఎయిర్ ఫోర్స్ పైలట్‌గా కనిపించింది. మానుషి చివరిసారిగా 'బడే మియాన్ చోటే మియాన్' చిత్రంలో కనిపించింది. ప్రస్తుతం ఈ మాజీ మిస్ వరల్డ్ జాన్ అబ్రహం థ్రిల్లర్ మూవీ'టెహ్రాన్'లో కనిపించనుంది. ఈ బాలీవుడ్ భామ 017లో మిస్ వరల్డ్ కిరీటాన్ని గెలుచుకున్న సంగతి తెలిసిందే.

## వాష్ రూమ్ సన్నివేశంపై నటి షాకింగ్ కామెంట్స్



సినిమా సన్నివేశాల్లో సహజత్వం కోసం దర్శకులు పడే తాపత్రయంలో అద్భుతమైన కళాదృష్టి ఉంటే ఉండొచ్చు గాక..ఒక్కోసారి అది నటీనటులకు ప్రాణ సంకటంగా మారొచ్చు. ఎంత సహజత్వం కోసం తాపత్రయపడే ప్రేక్షకులైనా కొన్ని నిజజీవితంలో చేసే పనులు తెరమీద నేరుగా చూపిస్తే జుగుప్సాకరంగా ఫీల్ అవకుండా ఉండలేరు. అలాంటి వాటిలో వాష్‌రూమ్ సన్నివేశాలు ముందు వరుసలో ఉంటాయి. అయితే అచ్చంగా అలాంటి ఒక సన్నివేశాన్ని చిత్రీకరించిన దర్శకుడు సహజత్వం కోసం సదరు నటిని చేయమన్న పని ఇప్పుడు నెట్టింట సంచలనంగా మారింది. హిందీలో షైతాన్ గా రీమేక్ చేయబడిన గుజరాతీ హర్రర్ చిత్రం వాష్(Vash) లో నటించిన నటి జాంకి బోడివాలా(Janki Bodiwala) ఆ సినిమాలో సనిన్నివేశాల చిత్రీకరణ సందర్భంగా తాను ఎదుర్కున్న అనుభవాలను నుంచి ఓ ఆశ్చర్యకరమైన విషయాన్ని వెల్లడించారు. ఇటీవల ఫిల్మ్‌ఫేర్‌తో జరిగిన రౌండ్‌టేబుల్ చర్చలో, ఆమె మాట్లాడుతూ వాష్ చిత్రంలోని ఒక కీలక సన్నివేశంలో తాను మూత్ర విసర్జన చేసే సీన్ ఉందన్నారు. అయితే ఆ సీన్‌ను రీమేక్ చేస్తున్న సమయంలో సహజత్వం కోసం దర్శకుడు కృష్ణదేవ్ యాగ్నిక్ నిజంగా మీరు మూత్ర విసర్జన చేయగలరా అని తనను అడిగినట్లు ఆమె వెల్లడించింది. సినిమాలో ఆ మూత్ర విసర్జన సన్నివేశం చాలా పెద్ద ప్రభావాన్ని చూపుతుందనీ కాబట్టి, ఆ సీన్‌లో నిజంగా ఆ పని చేయగలరా? అని దర్శకుడు అడిగినట్టు ఆమె తెలిపింది. అయితే ఆ మాటకి ముందు షాక్ తిన్నా... ఆ తర్వాత తాను చాలా ఉద్విగ్నంగా ఫీల్ అయ్యానని ఆమె చెప్పింది. ఓహ్! నటుడిగా, నాకు తెరపై చేసే అవకాశం లభిస్తోంది. ఎవరూ చేయనిది.''అంటూ సంతోషపడ్డానని వివరించింది. అయితే, వారు సన్నివేశాన్ని చిత్రీకరించడానికి సిద్ధమైన తర్వాత తనకి దర్శకుడు కోరుకున్న విధంగా చేయడం అసాధ్యం అనిపించిందని ఆమె గుర్తు చేసుకుంది. ఆ సన్నివేశం తనను నటిగా ఉత్సాహపరిచింది కాబట్టి తాను చేయడానికి అంగీకరించానని వెల్లడించింది. ''కానీ తరువాత, అది జరగలేదు మరియు దీనికి చాలా రీటేక్‌లు తీసుకున్నాం. ఇది సెట్‌లో ఆచరణాత్మకంగా సాధ్యం కాదని నాకు అర్థమైంది. కాబట్టి మేము దానిని చేయడానికి వేరే మార్గాన్ని కనుగొన్నాం'' అంటూ ఆమె తెలిపింది. నిజ జీవితంలో తాను చేయలేని పనులు చేయగలిగినందుకు సంతోషంగా ఉన్నానని ఆ సన్నివేశం చేసినందుకు తను ఎలాంటి బాధ లేదని స్పష్టం చేసింది. కనోడియా, నీలమ్ పాంచల్ హితేన్ కుమార్ నటించిన వాష్ చిత్రాన్ని హిందీలో అజయ్ దేవ్‌గన్, జ్యోతిక ఆర్ మాధవన్‌లతో షైతాన్‌గా రీమేక్ చేశారు. ఒక రహస్యమైన అపరిచితుడు ఒక యువతిపై నియంత్రణ సాధించడం ద్వారా వారి ఇంట్లోని కుటుంబంపై ఎలా ప్రవర్తించాడు? అనే హారర్ కథ ఇది. రెండు భాషా చిత్రాలలోనూ నటించిన జానకి అపరిచితుడి ఉచ్చులో పడే కుమార్తెగా ఆకట్టుకుంటుంది.

## చిరంజీవితో శేఖర్ కమ్ముల.. కారణం ఏంటి?

తెలుగు దర్శకుల్లో శేఖర్ కమ్ముల కాస్త డిఫరెంట్. చాలా సాధారణంగా అనిపించే కథలతో సినిమాలు తీసి హిట్స్ కొడుతుంటారు. ప్రస్తుతం 'కుబేర' అనే చిత్రాన్ని రిలీజ్‌కి సిద్ధం చేశారు. ఈ క్రమంలోనే ఇప్పుడు మెగాస్టార్ చిరంజీవి ఓ విషయమై కలిశారు. అందుకు సంబంధించిన ఫొటోలని తన సోషల్ మీడియా ఖాతాల్లో పోస్ట్ చేశారు. 'టీనేజీలో ఒక్కసారి చిరంజీవి గారిని దగ్గరగా చూశాను. 'ఈయనతో సినిమా తీయాలి' అనే ఫీలింగ్ అంతే. నేను ఇండస్ట్రీకి వచ్చి 25 ఏళ్లు. 'లెట్స్ సెలబ్రేట్' అని మా టీమ్ అంటే నాకు గుర్తొచ్చింది చిరంజీవిగారే. కొన్ని జనరేషన్స్‌ని ఇన్‌స్పైర్ చేసిన పర్సనాలిటీ ఆయన. 'ఛేజ్ యువర్ డ్రీమ్స్, సక్సెస్ మనల్ని ఫాలో అయి తీరుతుంది' అన్న నమ్మకం ఇచ్చింది ఆయనే' 'కాబట్టి నా 25 ఏళ్ల జర్నీ సెలబ్రేషన్స్ అంటే ఆయన దగ్గరే చేసుకోవాలి అనిపించింది. థ్యాంక్యూ సరే ఈ మూమెంట్స్‌లోనే కాదు, నా టీనేజ్ నుండి మీరు నా ముందు ఇలాగే ఉన్నారు' అని శేఖర్ కమ్ముల తన ఆనందాన్ని అక్షరాల రూపంలో రాసుకొచ్చారు. 'డాలర్ డ్రీమ్స్' సినిమాతో దర్శకుడిగా మారిన ఈయన.. ఆనంద్, గోదావరి, లీడర్, ఫిదా, లవ్ స్టోరీ.. ఇలా చాలా మంచి సినిమాల్ని అందించారు. జూన్ 20న 'కుబేర'తో ప్రేక్షకుల్ని పలకరించబోతున్నారు.




# క్రీడా వార్తలు | SPORTS NEWS



## రషీద్ ఖాన్ అత్యంత చెత్త రికార్డు.. ఐపీఎల్ చరిత్రలోనే

రషీద్ ఖాన్.. ప్రపంచంలోనే అత్యుత్తమ స్పిన్నర్లలో ఒకడిగా పేరు గాంచాడు. తన స్పిన్ మయాజాలంతో ప్రత్యర్థులను ముప్పు తిప్పలు పెట్టే సత్తా ఉన్నోడు రషీద్. కానీ ఐపీఎల్ 2025లో మాత్రం రషీద్ తన మార్క్‌ను చూపించలేకపోయాడు. ఈ ఏడాది సీజన్‌లో అఫ్గాన్ స్టార్ స్పిన్నర్ దారుణంగా విఫలమయ్యాడు ప్రతీ మ్యాచ్‌లోనూ భారీగా పరుగులు సమర్పించుకుంటూ జట్టుకు భారంగా మారాడు. శుక్రవారం ముంబై ఇండియన్స్‌తో జరిగిన ఎలిమినేటర్‌లోనూ అదే తీరును కనబరిచాడు. తన నాలుగు ఓవర్లలో కోటాలో వికెట్ ఏమీ తీయకుండా 31 పరుగులు ఇచ్చాడు. ఓవరాల్‌గా ఈ ఏడాది సీజన్‌లో 15 మ్యాచ్‌లు ఆడిన రషీద్.. 9.34 ఏకానమితో కేవలం 9 వికెట్లు మాత్రమే పడగొట్టాడు..

### రషీద్ ఖాన్ చెత్త రికార్డు..

ఈ క్రమంలో రషీద్ ఖాన్ అత్యంత చెత్త రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఒక ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక సిక్సర్లు సమర్పించుకున్న బౌలర్‌గా రషీద్ అప్రతిష్టను మూటకట్టుకున్నాడు. ఈ ఏడాది సీజన్‌లో రషీద్ ఏకంగా 33 సిక్సర్లు ఇచ్చాడు. ఇప్పటివరకు ఈ రికార్డు టీమిండియా ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్ పేరిట ఉండేది. 2022 ఐపీఎల్ సీజన్‌లో ఆర్సీబీకి ప్రాతినిధ్యం వహిస్తూ సిరాజ్ 31 సిక్సర్లు ఇచ్చాడు. తాజా మ్యాచ్‌లో రెండు సిక్సర్లు ఇచ్చిన రషీద్.. సిరాజ్‌ను అధిగమించాడు. వీరిద్దరి తర్వాత స్థానాల్లో చాహల్ (30), హసరంగా (30),బ్రావో ఉన్నారు. కాగా ఎలిమినేటర్ మ్యాచ్‌లో 20 పరుగుల తేడాతో గుజరాత్ ఓటమి పాలైంది.

## రిలాక్స్.. నా పని నాకు బాగా తెలుసు

## కోచ్ మాట వినని బుమ్రా

ఐపీఎల్ 2025 సీజన్ ఫైనల్‌కు చేరేందుకు ముంబై ఇండియన్స్ అడుగు దూరంలో నిలిచింది. శుక్రవారం జరిగిన ఎలిమినేటర్‌లో గుజరాత్ టైటాన్స్‌ను 20 పరుగుల తేడాతో ఓడించిన ముంబై.. క్వాలిఫయర్ 2కు అర్హత సాధించింది. ఆదివారం జరగనున్న సెకెండ్ క్వాలిఫయర్‌లో పంజాబ్ కింగ్స్‌తో హార్దిక్ సేన అమీతుమీ తెల్చుకోనుంది. కాగా ఎలిమినేటర్‌లో ముంబై విజయం సాధించడంలో పేస్ గుర్రం జస్ప్రీత్ బుమ్రాది కీలక పాత్ర. తీవ్ర ఒత్తిడిలో కూడా బుమ్రా తన అద్భుత బౌలింగ్‌తో ముంబైను గెలుపు తీరాలకు చేర్చాడు. 229 భారీ లక్ష్య ఛేధనలో పవర్ ప్లేలోనే కెప్టెన్ శుబ్‌మన్ గిల్, మెండిస్ వికెట్లను గుజరాత్ కోల్పోయినప్పటికి.. సాయిసుదర్శన్(80), వాషింగ్టన్ సుందర్(48) ముంబై బౌలర్లపై విరుచుపడ్డారు. వీరిద్దరూ దూకుడుగా ఆడుతూ గుజరాత్‌ను లక్ష్యానికి చేరువ చేశారు. సుందర్, సాయి విధ్వంసం ఫలితంగా టైటాన్స్ 13 ఓవర్లలో 150 పరుగుల మార్క్‌కు చేరువైంది. దీంతో ముంబై డౌగట్‌తో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో ముంబై కెప్టెన్ హార్దిక్ పాండ్యా.. 14 ఓవర్ వేసేందుకు బుమ్రాను తిరిగి ఎటాక్‌లో తీసుకొచ్చాడు. కెప్టెన్ నమ్మకాన్ని బుమ్‌బుమ్ బుమ్రా వమ్ము చేయలేదు. ఆ ఓవర్‌లో వాషింగ్టన్ సుందర్‌ను బుమ్రా అద్భుతమైన యార్కర్‌తో క్లీన్ బౌల్డ్ చేశాడు. సుందర్ ఔటైనప్పటికి, క్రీజులో ఇంకా ఇన్‌ఫామ్ బ్యాటర్ సుదర్శన్ ఉండడంతో ముంబై కోచింగ్ స్టాఫ్ తీవ్ర ఒత్తిడిలో కన్పించారు. బౌండరీ లైన్ వద్దకు హెడ్‌కోచ్ జయవర్ధనే, కీరన్ పొలార్డ్ వచ్చి ఫీల్డర్లకు, బౌలర్లకు పదేపదే తమ సూచనలను పంపారు.

**కోచ్ మాట వినని బుమ్రా..**

ఈ క్రమంలో జయవర్ధనే బౌండరీ లైన్ దగ్గర బుమ్రాకు ఏదో చెబుతుండగా అతడు విన్పించుకోలేదు. "ప్రశాంతంగా ఉండండి, నా పని నాకు తెలుసు. నేను చూసుకుంటా అని బుమ్రా అన్నట్లు హిందీ కామెంటేటర్ జతిన్ సప్రు వ్యాఖ్యనించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫోటో సోషల్ మీడియాలో వైరలవుతోంది.



## చాహల్‌తో డేటింగ్ రూమర్స్.. ఆర్జే మహ్‌వశ్ మరో పోస్ట్ వైరల్!

ఐపీఎల్ ప్రారంభం నుంచి ఆర్జే మహ్‌వశ్ పేరు మార్మోగిపోతోంది. చాహల్‌తో కలిసి ఛాంపియన్ ట్రోఫీలో కనిపించడంతో ఆమె పేరు ఒక్కసారిగా వైరలైంది. ఇంకేముందు టీమిండియా క్రికెటర్ చాహల్‌తో డేటింగ్ చేస్తున్నారంటూ ఒకటే టాక్. ఆ తర్వాత పంజాబ్ కింగ్స్ ప్రతి మ్యాచ్‌కు ఆర్జే హాజరు కావడం ఆ రూమర్స్‌కు మరింత బలం చేకూరింది. ఇటీవల ఆర్సీబీ పంజాబ్ మ్యాచ్‌లోనూ మహ్‌వశ్ స్పెషల్ అట్రాక్షన్‌గా కనిపించింది. ఈ నేపథ్యంలోనే ఆర్జే మహ్‌వశ్ మరో పోస్ట్‌తో వార్తల్లో నిలిచింది. నీ జీవితంలో ఏది ముఖ్యమో అది నీకే తెలుసు.. నువ్వు ఎవరితోనూ ఎప్పుడు తప్పు చేయవని తెలుసు.. నీ లక్ష్యం విషయంలో క్లారిటీ ఉంది.. మీరు నిజాయితీగా జీవించండి..ఎవరెమనుకున్నా హ్యాపీగా వాటిని వదిలేయండి. అంటూ ఇన్‌స్టాలో షేర్ చేసింది. అయితే ఈ పోస్ట్ చూసిన నెటిజన్స్ చాహల్‌తో డేటింగ్ వార్తలపైనే స్పందించిందని కామెంట్స్ చేస్తున్నారు. ఇటీవల తనపై వస్తున్న వార్తల నేపథ్యంలోనే ఆర్జే మరోసారి క్లారిటీ ఇచ్చేసిందని అంటున్నారు. కాగా.. ఆర్జే మహ్‌వశ్..చాహల్ గతేడాది మొదటిసారి జంటగా కనిపించారు. కొరియోగ్రాఫర్ ధనశ్రీ వర్మను వివాహం చేసుకున్న చాహల్ ఇటీవలే విడాకులు కూడా తీసుకున్నారు. అందుకే మహ్‌వశ్‌తో డేటింగ్ చేస్తున్నాడని రూమర్స్ వినిపించాయి. ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో వీరిద్దరు కనిపించడంతో అప్పటి నుంచే మరింత వైరలయ్యాయి.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com